ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (గురు)
సహరి : 4:50 (శుక్ర)

'పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం. ఇదే మా తొలి ప్రాధాన్యం. బస్టాండ్లు, కాంప్లెక్స్‌లలో మౌలిక సదుపాయాలపై శ్రద్ధపెట్టాం. మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీరు, కుర్చీలు, ఫ్యాన్లు మొదలైన వాటిని సమకూరుస్తున్నాం. వీటిని ఈ నెల 30వ తేదీలోగా పూర్తి స్థాయిలో కల్పించేలా ఆదేశాలు ఇచ్చాం. అలాగే బస్సులు సమయానికి నడిచేలా చూస్తున్నాం' అని జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ చెప్పారు. బుధవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన ఫోన్‌లకు సమాధానాలు ఇచ్చారు. వారు వెలిబుచ్చిన సమస్యలను నమోదు చేసుకుని, పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు ఎక్కువగా నూతన బస్ సర్వీస్‌ల ఏర్పాటు, బస్టాండుల్లో మౌలిక వసతుల నిర్వహణలలో లోపాలను ఆర్‌ఎం దృష్టికి తీసుకుని వచ్చారు. ఏ సమస్యలు ఉన్నా.. తమ దృష్టికి తేవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ప్రజలకు.. ఆర్టీసీ అధికారులకు మధ్య ఫోన్ ఇన్ లాంటి కార్యక్రమం చేపట్టిన ఆంధ్రజ్యోతిని ఈ సందర్భంగా ఆర్‌ఎంతోపాటు ప్రజలు అభినందించారు.

(ఏలూరు/ భీమవరం టౌన్-అర్బన్, ఆంధ్రజ్యోతి)



మా ఊరికి బస్సులు నడపండి

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన



- ఏలూరు జిల్లాలో సమస్యలను ఏకరవు పెట్టిన ప్రజలు
- దెందులూరు నుంచి విజయవాడకు బస్సు నడుపుతాం
- రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ అందుకునేలా బస్సు సమయాన్ని మారుస్తాం
- జిల్లాకు కొత్తగా 31 బస్సులు రాక
- సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఆర్‌ఎం వరప్రసాద్ హామీ



జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం



'ఫోన్ ఇన్'లో మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం వరప్రసాద్

జిల్లాకు కొత్త బస్సులు

- ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోలకు కొత్తగా రెండు ఇంద్ర, నాలుగు స్టార్‌లైన్ స్లీపర్స్, 20 సూపర్ లగ్జరీ, మూడు అల్ట్రా డీలక్స్, రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చాయి. వీటిని వినియోగంలోకి తెస్తున్నాం. చింతలపూడి నుంచి విజయవాడకు కొత్త సర్వీసను నడిపేందుకు ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం రాగానే నడుపుతాం.

అధికారులకు ఆదేశాలు

- ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ఆర్‌ఎం వరప్రసాద్ తక్షణం స్పందించారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే ఆయన చాంబర్‌లో జిల్లా ఆర్టీసీ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వాటిని తనకు తెలియజేయాలని తెలిపారు.

బస్సులు నడపండి

- ఏలూరు-టి.నరసాపురం వయా రామచంద్రాపురం, బాపిరాజుగూడెం మీదుగా గతంలో నడిచే బస్సు తీసేశారు. తిరిగి పునరుద్ధరించండి.

- నల్లూరి శ్రీనివాస్, టి.నరసాపురం

- చింతలపూడి నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సును నడపండి.

- తొర్లపాటి బాబూరావు, చింతలపూడి

- ఏలూరు నుంచి చింతలపూడికి రాత్రి సమయంలో రావాలంటే ఇబ్బందిగా ఉంది. ఏడు-ఎనిమిది గంటల మధ్య బస్ సర్వీసును ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- ఆరేపల్లి అప్పారావు, చింతలపూడి

- నూజివీడు రెవెన్యూ డివిజన్‌గా మార్చారు. తరచూ మేం ఇక్కడకు వెళుతుంటాం. ధర్మాజీగూడెం నుంచి నూజివీడుకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. బస్సును నడిపే ఏర్పాటు చేయండి.

- జి.సత్యనారాయణ, ధర్మాజీగూడెం

- ముదినేపల్లి నుంచి ఏలూరు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలి. సింగరాయపాలెం నుంచి ఏలూరుకు వయా కైకలూరు మీదుగా బస్సు ఏర్పాటు చేయండి.

- సాయిబాబు, నాగమల్లేశ్వరరావు, నరసింహరావు, ముదినేపల్లి

ఆర్‌ఎం : ఆయా రూట్‌లను పరిశీలించి, అవసరమైన చోట్ల బస్సులను నడిపే ఏర్పాటు చేస్తాం.

- జాతీయ రహదారిపై వున్న నియోజకవర్గ కేంద్రం ఉంగుటూరు. ఏలూరు-తాడేపల్లిగూడెం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక్కడ ఆగడం లేదు. ఈ ఊరిలో ఆగేలా చూడాలి.

- పాతూరి వంశీకృష్ణ, ఉంగుటూరు

ఆర్‌ఎం : మీ ప్రతిపాదన పరిశీలించి, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇస్తాం.

- రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ నడిచే సమయాలు మారాయి. దీనికి అనుగుణంగా ధర్మాజీగూడెం నుంచి ఉదయం ఏలూరు వెళ్లే బస్సు సమయాన్ని 20 నిమిషాలు ముందుకు మారిస్తే మాకందరికి ఉపయోగంగా ఉంటుంది.

- పొత్తూరి శ్రీనివాసరావు, ధర్మాజీగూడెం

ఆర్‌ఎం : సంబంధిత డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు సమయాన్ని ముందుకు జరిపేలా చర్యలు తీసుకుంటాం.

- దెందులూరు మీదుగా విజయవాడకు బస్సు నడపాలని గతంలో ఆర్టీసీ ఎండీతోపాటు, మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రాలు ఇచ్చాం. ఇంత వరకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదు.

- ఎం.భూషణం, దెందులూరు

ఆర్‌ఎం : బస్సు ఏర్పాటుపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రానే బస్సును నడుపుతాం.

బస్టాండు అన్యాక్రాంతం

- జంగారెడ్డిగూడెం కొత్త బస్టాండులోకి బస్సులు వెళ్లేలా చూడాలి.

- బొండ సత్యనారాయణ చింతలపూడి

ఆర్‌ఎం : నిర్మించిన బస్టాండు ఆర్‌టీసీకి అప్పగించలేదు. గతంలో ఆర్‌ఎం కార్యాలయంలో ఇచ్చిన పత్రాలను మరోసారి తమకు అందజేస్తే చర్యలు తీసుకుంటా. వినియోగంలోకి తీసుకువస్తాం. డీఎంని పంపించి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- మా గ్రామంలోని బస్టాండ్ అన్యాక్రాంతమవుతోంది. ఆర్టీసీ అధికారులు దీనిని స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురావాలి.

- కేవీఎస్ఎస్ ప్రసాద్, ధర్మాజీగూడెం

ఆర్‌ఎం : బస్టాండ్ మా పరిధిలో లేదు. పంచాయతీ అధికారులు ఆర్టీసీకి అప్పగిస్తే చర్యలు తీసుకుంటాం.

నిర్వహణ బాలేదు

- నేను తరచూ హైదరాబాదుకు ఆర్టీసీలోనే వెళ్లి వస్తుంటాను. ఆ బస్సులో సీట్లు సరిగాలేవు. వాటర్ బాటిల్స్ పెటుకోవాలన్న అవకాశం లేదు.

- శేషగిరిరావు, చింతలపూడి

ఆర్‌ఎం : పరిశీలించి, సౌకర్యాలు మెరుగుపరుస్తాం.

- ఏలూరు బస్సు కాంప్లెక్స్ నుంచి విజయవాడకు నడుపుతున్న నాన్‌స్టాప్ బస్సులు అధ్వానంగా ఉంటున్నాయి. బస్‌లో కూర్చుంటే భయం వేస్తోంది. ఏపీ 5 జెడ్ 5274, 0015 నెంబర్ల బస్సులను పరిశీలించండి.

- మురళి, వెంకటేశ్వరరావు, ఏలూరు

ఆర్‌ఎం : ఏలూరు డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చి, తక్షణం మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటాం.

- ఈ నెల మూడో తేదీన విజయవాడ నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న బస్సులో డ్రైవర్ ప్రయాణికులతో అనుచితంగా మాట్లాడారు.

- అడుగుల ఫ్రాన్సిస్, జంగారెడ్డిగూడెం

ఆర్‌ఎం : దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

కేంద్ర మంత్రికి తప్పిన ప్రమాదం

ఢిల్లీలో కారును ఢీకొన్న మరో వాహనం.. వర్మ కాలికి గాయం.. భీమవరం రాక



భీమవరం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఢిల్లీలో బుధవారం ప్రమాదానికి గురయ్యారన్న వార్త జిల్లాలో కలకలం రేపింది. అసలు ఏమైందంటూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఆయన అభిమానులు, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నేతలు ఫోన్ చేసి ఆరా తీశారు. చిన్న ప్రమాదమని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పార్లమెంట్ సమావేశం అనంతరం తన కార్యాలయానికి వెళుతుండగా విజయ్ చౌక్ వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వర్మ కాలికి తీవ్ర గాయమైంది. వెంటనే వైద్య బృందం ఆయనకు ప్రత్యేక చికిత్స అందించి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో ఆయన ఢిల్లీ నుంచి భీమవరం బయలుదేరారు.

ఫ్లయ్ ఓవర్లు నిర్మించండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా విజ్ఞప్తి



నితిన్ గడ్కరీకి వివరిస్తున్న ఎంపీ మహేశ్

ఏలూరు టూ టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సబ్ వేలు, ఫ్లయ్ ఓవర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. 'కొల్లేటికోటకు డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.109 కోట్లు ఇవ్వాలి. భీమడోలు వద్ద ఫ్లయ్‌ఓవర్ నిర్మించాలి. రోడ్లకు ఇరువైపులా సబ్‌వేలు నిర్మించాలి. అంబర్‌పేట, వడ్లపట్ల వద్ద 1200 మీటర్ల ఫ్లయ్ ఓవర్లు నిర్మించాలి. గుండుగొలను జంక్షన్ వద్ద ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి, బాక్స్ కల్వర్ట్, ఉంగుటూరు వద్ద ఫ్లయ్ ఓవర్, సీతంపేట వద్ద ఫ్లయ్‌ఓవర్ బ్రిడ్జికి, ఎన్‌హెచ్-216ఏ, ఎన్‌హెచ్-16 జాతీయ రహదారిలో గుర్తించిన ఏడు బ్లైండ్ స్పాట్ల వద్ద ఫ్లయ్ ఓవర్‌లు, సబ్ వేల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి' అంటూ కోరారు. అంతకుముందు కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

పక్కాగా దేవదాయం!



ఎఫ్‌డీఆర్‌లపై జాయింట్ చెక్‌పవర్

- ఈవోలకు దేవదాయశాఖ కమిషనర్ షాక్
- సంవత్సరాంతంలోను ఎఫ్‌డీఆర్‌లపై తనిఖీలు
- మార్చి 31లోగా ప్రక్రియ పూర్తికి ఆదేశాలు

ఏలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖలో వరుస సంస్కరణలతో ఇక దేవాలయంపై వచ్చే ఆదాయం లెక్కలు పక్కాగా తేలనున్నాయి. ఇప్పటికే ఓ పక్క దేవాలయాల పునర్విభజన జరుగుతుండగా, మరోవైపు ఆదాయాలు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆలయ కార్యనిర్వహణాధికారితో పాటు ఆలయ ఆదాయ పరిమితి మేరకు ఇతర అధికారులకు జాయింట్ చెక్ పవర్ ఇచ్చారు. ఈ మేరకు దేవాదాయశాఖ కమిషనర్ సి.రామచంద్రమోహన్ ఇటీవల సర్క్యులర్ జారీ చేశారు. ఆలయాల్లో ఈవోలు గుడికి వచ్చే పలు ఆదాయాలను ఇష్టారాజ్యంగా ఖర్చు చేసేస్తూ తప్పుడు లెక్కలతో ఆ సొమ్మును తమ సొంత ఖాతాల్లో వేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీఆర్)ల్లో సైతం చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఇలాంటి ఆర్థిక అవతకలకు, గుడుల మనుగడకు విఘాతం కలిగిస్తున్నట్టు గుర్తించిన కమిషనర్ ఈవోతో పాటు ఆల య పరిమితి ప్రకారం పరిధిలోకి వచ్చే అసిస్టెంట్ కమిషనర్, డిప్యూ టీ కమిషనర్, ఆర్‌జేసీల సంతకం తోనే ఆలయాల జమలు, ఖర్చులు సరిచూడాలని నిర్దేశించారు. ఆ తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో మిగిలిన మొత్తాలను ప్రభు త్వ గుర్తింపు బ్యాంకుల్లో ఇద్దరి పర్యవేక్షణలో సంతకాలతో డిపాజిట్లు చేయాలని పేర్కొన్నారు. పదేళ్లకు మించి తక్కువ వడ్డీ వచ్చే బ్యాంకుల నుంచి ఆయా మొత్తాలను తీసేసి వడ్డీ ఎక్కువ ఇచ్చే బ్యాంకుల్లో కొత్తగా ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా మార్చాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ ప్రక్రియను మార్చి 31లోగా పూర్తి చేసి, ఆయా ఫిక్స్‌డ్ డిపాజిట్ల నమోదు బాండ్లను సైతం ఆయా జిల్లాల అసిస్టెంట్ కమిషనర్‌గా అవి సమర్పించాల్సి ఉంటుంది. జిల్లాలో 716 దేవాలయాలు, సత్రాలుండగా, 200కు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో జమలు జరుగుతున్నాయి. దీంతో ఆర్థిక లావాదేవీల్లో ఈవోల చేతివాటానికి చెక్ పడనుంది.

ఉత్తర్వులు పంపాం



జిల్లాలోని అందరి ఈవోలకు దేవదాయశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను పంపాం. ఆ మేరకు ఎఫ్‌డీఆర్‌లను వివరాలను సరిచూసి తమ కార్యాలయంలో జమ చేయాలని సూచించాం. ఈ విధానం వల్ల జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుంది.

- సీహెచ్ రంగారావు, జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

క్షేత్రస్థాయి పరిశీలన అవసరమే ?

ఇదే సర్క్యులర్‌లో దేవాలయాల భూసేకరణ, ల్యాండ్ సేల్ ప్రోసీడింగ్స్, సేవింగ్ డిపాజిట్లు, రిజర్వు ఫండ్స్, కార్పస్ ఫండ్, అన్నప్రసాదం, గోశాల, ఇతర ఎఫ్‌డీఆర్‌లపై క్షేత్రస్థాయిలో ఆయా అధికారులు పరిశీలన చేయాల్సిందేనంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ప్రతీ గుడిపైన జరిగే లావాదేవీలపై పర్యవేక్షణ జరిగితే ఆదాయాలు పక్కదారి పట్టకుండా ఉంటాయని తెలుస్తోంది. జేసీ, డీసీ, ఏసీలు ఆయా క్యాడర్లలోని దేవాలయాల ఎఫ్‌డీఆర్‌లపై ఏడాదికొకమారు తనిఖీలు చేయాల్సి ఉంటుంది.



కళాశాలలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

విష్ణు దంత వైద్య కళాశాలకు బాంబు బెదిరింపు

బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

భీమవరం క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం విష్ణు దంత కళాశాలకు బుధవారం బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో కలకలం రేగింది. అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం పోలీసులకు విషయాన్ని తెలపడంతో బాంబుస్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. ఎవరో కావాలనే కళాశాలలో బాంబు పెట్టామని ఫేక్ మెయిల్ పంపించినట్లు నిర్ధారించారు. భీమవరం రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వీర్రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కళాశాలలోని విద్యార్థుల బ్యాగులు, కళాశాలలో పార్సిల్స్, క్లాస్ రూముల్లో సుమారు 3 గంటలపాటు సోదాలు నిర్వహించారు. చివరకు అది ఫేక్ మెయిల్‌గా నిర్ధారించారు. మెయిల్‌లో మాత్రం అగంతకుడు కొన్నాళ్ల క్రితం తమిళనాడులో జరిగిన బాంబు బ్లాస్టింగ్ మాదిరిగానే విష్ణు దంత కళాశాలలో బాంబు పేలుతుందని మెసేజ్ పంపించాడు. మెయిల్‌ను ఎవరు పంపించారు, ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కళాశాలలో బాంబు లేదని తేలడంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.

అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్య పరిష్కారం



కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారం అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి తహసీల్దార్లను ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తుల పరిష్కార అంశంపై ఆర్డీవో, తహసీల్దార్లతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. అర్హత లేని దరఖాస్తులను తిప్పి పంపుతూ అందుకు గల కారణా లను స్పష్టంగా తెలపాలన్నారు. భూ వివాదాల పరిష్కారంలో నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ, ఎస్డీసీ భాస్కర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అభ్యంతరం కాని ఆక్రమణల క్రమబద్ధీకరణ

జిల్లాలో అభ్యంతరం కాని ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని 2019 అక్టోబరు 15లోగా ఇల్లు నిర్మించుకుని ఉన్న ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగి ఉన్న ఆక్రమణ దారులు గ్రామ,వార్డు సచివాలయాల్లో దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.

• చాట్రాయి తహసీల్దార్ సస్పెన్షన్



ప్రశాంతి (ఫైల్)

చాట్రాయి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి తహసీల్దార్ డి.ప్రశాంతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలల క్రితం ప్రశాంతి చాట్రాయి తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. అప్పటి నుంచి ఇష్టారాజ్యంగా భూములు మ్యూటేషన్ చేయడం, అవినీతి ఆరోపణలు, కార్యాలయానికి వచ్చిన ప్రజలపై దురుసుగా ప్రవర్తించడంపై ప్రజల నుంచి సీఎంకు, ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. రెండుసార్లు కలెక్టర్ షోకాజ్ నోటీసులు ఇచ్చినా పద్ధతి మార్చుకోలేదు. తహసీల్దార్‌పై వచ్చిన ఆరోపణలపై నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ విచారణ జరిపి వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని కలెక్టర్‌కు నివేదిక ఇవ్వడంతో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.



వరుస ప్రమాదాలతో హడల్..

ఏలూరు సమీపంలో మరో రెండు బస్సు ప్రమాదాలు .. 12 మందికి గాయాలు

జిల్లా కేంద్రం ఏలూరు సమీపంలో జరుగుతున్న వరుస ప్రమా దాలతో ప్రయాణికులు హడలి పోతున్నారు. బుధవారం తెల్లవారు జామున రెండు ఆర్టీసీ బస్సులు వేర్వేరు చోట్ల ప్రమాదానికి గురయ్యాయి. ఈ ప్రమాదాల్లో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు.

7



ఐడియా అదిరిందిగా !

ఎండలు మండిపోతున్నాయి.. అడుగు బయట పెట్టాలంటే జనం బెంబేలెత్తుతున్నారు.. ఏలూరు నగరంలో ఓ కిరణా షాపు వ్యాపారి మహేష్‌కు ఒక ఐడియా వచ్చింది. ఎండ నుంచి రక్షణ కోసం తన స్కూటీకి ఇలా గొడుగు ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో ఎండైనా భయం లేకుండా రాకపోకలు సాగిస్తున్నాడు. దీన్ని ఆన్‌లైన్‌లో 1800 రూపాయలకు తెప్పించి అమర్చుకున్నట్లు చెప్పాడు. దీంతో ప్రయాణం హాయిగా ఉందంటున్నాడు. వర్షాకాలంలోను ఇది రక్షణగా ఉపయోగపడుతుంది..

కాల్వల్లో కేరింతలు

వేసవి వచ్చేసింది.. ఎండ తాపాన్ని తట్టుకోవడానికి గ్రామాల్లోని యువత కాల్వల్లో ఈతకొడుతూ సేద తీరుతుంటారు. కేరింతలు కొడుతూ సందడి చేస్తుంటారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం వద్ద ఏలూరు కాలువలో ఇలా యువత కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు.. అయితే ఆ సరదా శృతిమించకుండా జాగ్రత్తగా ఉండాలి. హద్దులు దాటితే సరదా కాస్తా విషాదంగా మారిన సందర్భాలు ఉన్నాయంటూ చూసినవారు హెచ్చరిస్తున్నారు..

-తాడేపల్లిగూడెం రూరల్(ఆంధ్రజ్యోతి)



నేడు ఉద్యాన వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం విదేశీ వాణిజ్య పంటలు, స్వదేశీ వాతావరణంలో సాగు సాధ్యాలపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు వీసీ డాక్టర్ కె.గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో వియత్నాం, శ్రీలంక, అమెరికా తదితర దేశాలకు చెందిన ప్రొఫెసర్‌లు, శాస్త్రవేత్తలు ఆన్‌లైన్‌లో విధానం ద్వారా పాల్గొంటారని వివరించారు. సదస్సులో ఉద్యాన పంటలు హరిత భవిష్యత్ కోసం ప్రపంచ వాణిజ్యం, సుస్థిర సాంకేతికతలు, అనే అంశంపై సదస్సు కొనసాగుతుందన్నారు. ఈ సదస్సుకు శాస్త్రవేత్తలతో పాటు అభ్యుదయ రైతులు పాల్గొంటారని తెలిపారు.

రసధుని ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉగాది కవితల పోటీలు

పాలకొల్లు అర్బన్, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి) : పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ (ఉభయ రాష్ట్రాల) స్థాయిలో ఉగాది తెలుగు కవితల పోటీలను నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు, కార్యదర్శి జె.జయదుర్గారావు, కోశాధికారి యర్రంశెట్టి వెంకటరత్నం తెలిపారు. పోటీలకు కవితను తెల్ల కాగితం మీద 25 లైన్లకు మించకుండా రాసి పూర్తి చిరునామా,ఫోన్ నెంబరుతో భాస్కరరావు, అధ్యక్షుడు, రసధుని సాహితీ సంస్థ, వేడంగి, పోడూరు మండలం, 534265, ప.గో జిల్లా అడ్రస్‌కు ఈనెల 26వ తేదీ లోపుగా పోస్టు ద్వారా పంపాలని తెలిపారు. ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్టు తెలిపారు

భీమవరంలో జిల్లాస్థాయి కవితల పోటీ

భీమవరం టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉగాది వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయిలో కవితలు, కథానికలు, సామెతల పోటీలను నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలవారు పోస్టల్ లోగాని వాట్సాప్ ద్వారా గానీ పంపించవచ్చునని నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి తెలిపారు. ఉగాది, భారతీయ సంస్కృతికి సంబంధించి 15 పంక్తులతో కవితలు పంపించవచ్చునని 96400 88779 వాట్సప్ ద్వారా లేదా భీమవరం సర్ సీవీ రామన్ స్కూల్లో ఈనెల 20 తేదీ లోపు స్వయంగా అందించవచ్చని తెలిపారు. ఈనెల 30న భీమేశ్వర స్వామి ఆలయంలో జరిగే ఉగాది వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

చిన వెంకన్న క్షేత్రంలో రేపటి నుంచి సాయంకాల అర్చన సమయం మార్పు

ద్వారకాతిరుమల, మార్చి 12 (ఆంధ్ర జ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో సాయంకాలార్చన సమయాన్ని శుక్రవారం నుంచి మార్పు చేస్తున్నట్లు ఆలయ ఈఓ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఇప్పటి వరకూ సాయంకాలార్చన సమయం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకూ ఉండగా దానిని సాయంత్రం 05.30 గంటల నుంచి రాత్రి 7 గంటలవరకూ మార్పు చేసినట్లు వివరించారు. ఈ నెల 14 నుంచి స్వామి వారి దర్శనం భక్తులకు సాయంత్రం 5.30 గంటల వరకూ లభిస్తుందన్నారు. సాయంకాలార్చన అనంతరం 7 గంటల నుంచి స్వామి దర్శనం లభిస్తుందని తెలిపారు.

కిడ్నీ..జర పదిలం

నేడు ప్రతి ఒక్కరిది క్షణం తీరికలేని జీవితం. యాంత్రికంగా రోజులను గడిపేస్తున్నారు. అనారోగ్యకర ఆహారాన్ని తీసుకుంటూ ప్రమాదాన్ని మనమే తెచ్చుకుంటున్నాం. మానవ శరీరంలో ఏ అవయవం దెబ్బతిన్నా దాని ప్రభావం కిడ్నీపైనే పడుతుంది. తాగే నీరు నుంచి తినే ఆహారం వరకూ కిడ్నీపై ప్రభావం చూపుతుంది. నేడు కిడ్నీ బాధితులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. కిడ్నీని ఆరోగ్యంగా ఉంచడానికి, ప్రజల్లో అవగాహన కల్పించడానికి 2006లో ప్రపంచ దేశాలు మార్చి రెండో గురువారాన్ని ప్రపంచ కిడ్నీ డేగా ప్రకటించాయి. అప్పటి నుంచి ప్రతి ఏడాది మార్చి 2వ గురువారాన్ని ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.



పెరిగిపోతున్న వ్యాధి బాధితులు

ఉమ్మడి జిల్లాలో8 వేల మంది పైనే ..

ఏలూరు జిల్లాలో 641 మందికే పెన్షన్లు

ఆహారపు అలవాట్లతోనే ప్రమాదం

జాగ్రత్తలతోనే ఆరోగ్యానికి రక్షణ

నేడు వరల్డ్ కిడ్నీ డే

ఏలూరు క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) :మానవ శరీరంలో ముఖ్యమైన అవయవం మూత్రపిండాలు. శరీరంలోని రక్తాన్ని శుద్ధిచేసి శరీర భాగాలకు సరఫరా చేయడంలో మూత్రపిండాలు పాత్ర గణనీయమైనది. ఎప్పటికప్పుడు రక్తంలో చేరిన మలినాలను వడపోసి మూత్రరూపంలో బయటకు పంపి మనిషి ఆరోగ్యాన్ని కాపడుతాయి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే సరిపడా నీరు తాగాలి. అవసరమైన ఆహారాన్ని తినాలి. ఎక్కువ ఉప్పు (లవణాలు) తిన్నా కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో రంగులు కలిపిన ఆహారం, టేస్టింగ్ సాల్ట్, నిల్వ ఉన్న ఆహారపదార్థాలు తినడం వల్ల దాని ప్రభావం కిడ్నీపై పడుతుంది. బీపీ, సుగరు కూడా కిడ్నీలపై ప్రభావం చూపుతాయి.

ఎలా గుర్తించాలి

క్రానికల్ కిడ్నీ డిసీజ్ (సీకెడీ). వైద్య పరిభాషలో ఈ విధంగా కిడ్నీ వ్యాధిని వర్ణిస్తారు. కిడ్నీ ఇన్‌ఫెక్షన్లకు లోనైనప్పుడు జ్వరం వస్తుంది. కాళ్ళకు నీరు వచ్చి వాపులు వస్తాయి. ఆయాసం వస్తుంది. ఇలాంటి సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల ఖచ్చితంగా వ్యాధిని గుర్తించవచ్చు. క్రియేటినిన్ పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు. సాధారణంగా 0.2 నుంచి 1.4 వరకూ క్రియేటినిన్ ఉంటే సాధారణమైన పరిస్థితిలోనే కిడ్నీ ఉందని భావిస్తారు. కానీ క్రియేటినిన్ శాతం పెరుగుతూ ఉంటే కిడ్నీ వ్యాధికి గురైందని పని తత్వాన్ని కోల్పోతుందని గుర్తించి అవసరమైన వైద్యాన్ని అందిస్తారు. కొన్ని పరిస్థితుల్లో డయాలసిస్ కూడా చేయాల్సిన పరిస్థితులు వస్తాయి. చివరకు డయాలసిస్ చేస్తున్నప్పటికీ ఇంకా రోగి పరిస్థితి ప్రమాదకరంగా మారితే రక్త బంధువులు, కుటుంబ సభ్యుల్లో ఒకరి నుంచి ఒక కిడ్నీని దానంగా తీసు కుని అమర్చడానికి ప్రభుత్వ అనుమతితో చర్యలు తీసు కుంటారు. కానీ ఇది లక్షలతో కూడిన వ్యవహారం. ఇలాంటి పరిస్థితిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ఎంతో ముఖ్యం.



పెరుగుతున్న బాధితులు

ఏలూరు జిల్లాలో ఐదు వేల మంది పైగా కిడ్నీ బాధితులు ఉండగా పశ్చిమ గోదావరి జిల్లాలో 3 వేల వరకు బాధితులు ఉన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం కిడ్నీ చిన్నగా ఉన్నా, క్రియేటినిన్ 5.0 కన్నా ఎక్కువ ఉన్నా కిడ్నీ మార్పిడి చేసిన వారికి ప్రభుత్వం నుంచి నెలకు పది వేల రూపాయలు పెన్షన్ అందిస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఇప్పటికే కిడ్నీ పెన్షన్‌ను 10 వేల రూపాయలు చొప్పున నెలకు 641 మందికి ప్రభుత్వం అందిస్తుంది. ఇంకా దరఖాస్తులు పెట్టిన వారు మరో 280 మంది వరకూ ఉన్నారు. కేవలం వీరు తెలుపు రంగు రేషన్ కార్డు కలిగిన వారు మాత్రమే. ఎంతో మంది బాధితులు జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, తణుకు, తాడేపల్లిగూడెం, నూజివీడు, భీమవరం, పాలకొల్లు ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అత్యధికంగా ఏలూరు, తణుకు, ప్రాంతాల్లోనే ఎక్కువ మంది బాధితులు డయాలసిస్ చేయించుకుంటున్నారు.

• జాగ్రత్తలే శ్రీరామరక్ష



షుగరు, బీపీ వల్ల కిడ్నీలు పాడయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం వల్ల, నీళ్ళు తక్కువ తాగడం వల్ల కిడ్నీ వ్యాధికి గురవుతుంది. కిడ్నీ వ్యాధికి గురైన వారు పండ్ల రసాలు, ఆకుకూరలు, నీళ్ళను తక్కువ తీసుకోవాలి. ధూమపానం, మద్యం అలవాటు ఉన్నవారికి కూడా కిడ్నీ సమస్య తలెత్తే అవకాశం ఉంది. పెయిన్ కిల్లర్స్, యాంటి బయోటిక్స్ ఎక్కువగా వాడడం వల్ల కిడ్నీలు దెబ్బతినే అవకాశం ఉంది. కాళ్ళకు నీరు పట్టి వాపులు వచ్చి, జ్వరం రావడం, ఆయాసంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి కిడ్నీకి సంబంధించిన పరీక్షలను చేయించుకోవాలి. ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి సూచించిన విధానంలో మందులు వాడడం వల్ల కిడ్నీ వ్యాధిని కొంత వరకూ నయం చేసుకోవచ్చును. వాంతులు, విరోచనాలు అయినప్పుడు వైద్యుల చేత చికిత్స పొందాలి.లేనిపక్షంలో కిడ్నీ ఇన్‌ఫెక్షన్లకు గురై దెబ్బతినే ప్రమాదం ఉంది. వైద్యులు సూచనలు లేకుండా నొప్పి బిళ్ళలను, యాంటిబయోటిక్స్‌ను వాడకూడదు. మనం తీసుకునే జాగ్రత్తలతోనే కిడ్నీలను కాపాడుకోవచ్చు.

- డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, ఎండీ జనరల్, ఏలూరు

- ఏలూరులోని కత్తేపువీధికి చెందిన ఒక వ్యక్తికి ముగ్గురు కుమార్తెలు. ఆయన ఒక చికెన్ షాపులో రోజువారి కూలీగా పనిచేస్తున్నారు. పెద్ద కుమార్తె (10) చిన్ననాడే పొట్ట ఉబ్బిపోయి ఉండడంతో వైద్యుల వద్దకు తీసుకువెళ్ళగా ఆమెకు కిడ్నీ వ్యాధి ఉందని నిర్ధారించారు. అప్పటి నుంచి ఆయన హైదరాబాద్‌లో మందులు వాడుతున్నారు. నెలనెలా మందులకు వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. అతని సంపాదన ఆమె వైద్యానికే సరిపోతోంది. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అతనికి సాయం అందడం లేదు.. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.
- జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన దంపతులు కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఒక కుమార్తె (15) తరచుగా కడుపునొప్పితో బాధపడుతుండగా రాజమండ్రిలోని వైద్యుల వద్దకు తీసుకువెళ్ళగా ఆమె కిడ్నీ చిన్నగా ఉందని, కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌కు గురైందని వెల్లడించడంతో ఆ తల్లి దండ్రులు తల్లడిల్లిపోయారు. ప్రస్తుతం మందులకే వారికి నెలకు ఏడు వేల రూపాయల వరకూ ఖర్చులు అవుతున్నాయని వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌కు అర్హత కావాలంటే క్రియాటినిన్ 5.0 కంటే ఎక్కువ ఉండాలన్న నిబంధన ఉండడంతో వారికి పెన్షన్ రావడం లేదు. ఈ మందులు ప్రభుత్వాసుపత్రిలో లభ్యం కాకపోవడంతో తమ బిడ్డను కాపాడుకోవడానికి నెలవారీ మందుల కోసం కాయకష్టంతోనే బిడ్డను కాపాడుకుంటున్నారు. ఇలాంటి బాధితులు జిల్లాలో ఎందరో ఉన్నారు.

పశ్చిమలో రెండే డయాలసిస్ కేంద్రాలు

భీమవరం క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ రోగులకు ప్రభుత్వం అందించే సాయం అంతంత మాత్రం కావడంతో చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేద, మధ్య తరగతి వారు డయాలసిస్ చేయించుకోవాలంటే ఖర్చుతో కూడిన వైద్యం. చాలామంది కిడ్నీ రోగులు అప్పులు చేసి అవస్థలు పడుతున్నారు.పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 3 వేల మంది కిడ్నీ రోగులు ఉన్నట్టు వైద్య ఆరోగ్య శాఖ వివరాల ద్వారా తెలుస్తున్నది. అయితే డయాలసిస్ కేంద్రాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెండే ఉన్నాయి. అవి కూడా అంతంత మాత్రంగానే సేవలు అందించడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తున్నది. పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే డయాలసిస్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఆ కేంద్రాల్లో రోజుకు పది మందికి మాత్రమే డయాలసిస్ చేసే అవకాశం ఉండటంతో చాలా మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రానికి సన్నాహాలు జరిగినప్పటికీ అవి ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయాయి. అయితే పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తున్నట్లు సమాచారం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకోవాలంటే ఒకసారికి రూ. 3 వేలు చెల్లించాల్సిన పరిస్థితి. పరిస్థితి బట్టి వారానికి రెండు సార్లు, నెలకు 8 సార్లు డయాలసిస్ చేయించుకోవాలి. అంటే సుమారుగా రూ. 24 వేల రూపాయలు నెలకు చెల్లించవలసిన పరిస్థితి. కాకినాడ, రాజమహేంద్రవరం వంటి ఆసుపత్రులలో డయాలసిస్ కేంద్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ కిడ్నీ రోగులు అంత దూరం వెళ్ళలేక జిల్లాలోని రెండు ఆసుపత్రుల వద్ద పడిగాపులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కిడ్నీ రోగులకు మెరుగైన సేవలందిస్తామని, వారి కోసం భారీగా పెన్షన్లు ఇచ్చి ఆదుకుంటామని ప్రకటించిన ప్రభుత్వం అంతంత మాత్రంగానే పెన్షన్లు ఇవ్వడంతో చాలా మంది అవస్థలు ఎదుర్కొన్నారు.

• ప్రతిపాదనలు పంపించాం



భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రానికి అనుమతులు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. చాలా మంది పేద, మధ్య తరగతి కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ కోసం చాలా అవస్థలు పడుతున్నారు. వేలల్లో ఖర్చు పెట్టి ప్రయివేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేక అప్పుల పాలవుతున్నారు. భీమవరంలో డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తే భీమవరం చుట్టుపక్కల మండలాలకే కాకుండా కృష్ణా జిల్లాలోని కొన్ని మండలాల రోగులకు కూడా వైద్యం అందుబాటులోకి వస్తుంది

డాక్టర్ మాధవీ కళ్యాణి, భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

ప్రజలకు ప్రయోజనం కలిగేలా పనులు నిర్వహించాలి

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ సమీక్ష



ఏలూరుసిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణాభివృద్ధి పనులు వేగవంతంగా నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు ప్రయోజనం కలిగేలా చేయాలని అధికారులను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లా పరిషత్ ద్వారా మంజూరైన పంచాయతీరాజ్ అభివృద్ధి పనుల పురోగతి, జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన, ఏపి గ్రామీణ రహదారి కనెక్టివిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన రహదారి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, రహదారి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో భీమేశ్వర్, పంచా యతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు బహుమతులు

జిల్లా పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులు కోసం క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాల్గొన్న మహిళా ఉద్యోగులకు బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బహుమతులు అందజేశారు.



పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి యాప్ బ్రోచర్ ప్రదర్శిస్తున్న మీనాక్షి చౌదరి

శక్తి యాప్‌ను వినియోగించుకోవాలి : సినీనటి మీనాక్షి చౌదరి

ఏలూరు క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత కోసం పోలీసులు తాము న్నామని భరోసా ఇస్తూ ప్రవేశపెట్టిన శక్తి యాప్‌ను మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు వినియోగించుకుని ఆపద సమయంలో పోలీసుల సహాయం పొందాలని సినీనటి మీనాక్షి చౌదరి అన్నారు. ఏలూరులోని ఒక ప్రైవేటు షాపింగ్ మాల్‌ను ప్రారంభించడానికి వచ్చిన ఆమె పోలీస్‌లు ప్రవేశపెట్టిన శక్తి యాప్ బ్రోచర్‌ను ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, యువతులు, విద్యార్థులు శక్తియాప్‌పై అవగాహన పెంచుకోవాలని ఆపద సమయంలో 112కు కాల్ చేయాలని సూచించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల భద్రత కోసం శక్తియాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్‌లోని ఎస్‌ఓఎస్ క్లిక్ చేస్తే వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సమాచారం వెళ్తుందన్నారు. జియో లోకేషన్ ట్రాకింగ్, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుందని అక్కడ నుంచి ఆపదలో ఉన్న వారి ప్రదేశాన్ని గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ సుబ్బారావు, త్రిటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ల సీనియార్టీపై కొనసాగుతున్న కసరత్తు

ఏలూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ పూర్తయింది. ఉమ్మడి జిల్లాలో అన్ని కేడర్లలో మొత్తం 11,388 మంది టీచర్లకు సీనియార్టీ నెంబర్లను కేటాయిస్తూ విడుదల చేసిన జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించిన విషయం విదితమే. మొత్తం 305 మంది ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలురాగా, వీటిలో 273 అభ్యంతరాలను పరిష్కరించారు. నోషనల్ సీనియార్టీకి సంబంధించిన అభ్యంతరాలను పరిష్కరించాల్సి ఉంది. తుది సీనియార్టీ జాబితాలను త్వరలో సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో పొందపరుస్తారని తెలుస్తోంది. ఇపుడు రూపొందించిన సీనియార్టీ జాబితాల వల్ల అంతగా ఉపయోగం ఉండబోదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీనియార్టీ జాబితాలను ఎస్జీటీలకు సంబంధించినదైతే స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఆయా సబ్జెక్టుల వారీగా అర్హతలుగల ఉపాధ్యాయుల వివరాలతో జాబితాను రూపొందిస్తే అందరికీ ప్రయోజన కరంగా ఉండేదని తెలుస్తోంది. అలాగే గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతులకు ప్రామాణికంగా తీసుకునే స్కూల్ అసిస్టెంట్లలో అర్హులను సబ్జెక్టులవారీగా రూపొందించడంవల్ల ఉపయోగ కరంగా ఉంటుందని చెబుతున్నారు. ఇంత చేసినా ఆయా కేడర్లవారీగా పదోన్నతుల సంఖ్యపై స్పష్టత లేదని సమాచారం.



నరికివేసిన ప్రాంతాన్ని చూపుతున్న గ్రామస్థులు

దర్జాగా నరికేశారు..

ముండూరు కన్నసముద్రం చెరువులోని నల్ల తుమ్మచెట్లు నరికివేత

వైసీపీ పాలనలో కలప దొంగల బరితెగింపు

పంచాయతీకి రూ.లక్షల్లో నష్టం

పెదవేగి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ముండూరు మేజర్ పంచాయతీ కావడానికి ఆ గ్రామంలో ఉన్న కన్నసముద్రంపై వచ్చే ఆదాయమే కారణం. అయితే అది ఒకప్పటి సంగతి. ఏడాది పొడవునా నీటితో కళకళలాడే 350 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆ చెరువు ఇప్పుడు నీళ్ల లేక వెలవెలబోతోంది. ఆ చెరువుకు వచ్చే గుండేరు వాగు కాల్వ ఆక్రమణలకు గురికావడంతో ఎంత భారీస్థాయిలో వరద వచ్చినా కన్నసముద్రం చెరువుకు నీరు అందడం లేదు. చెరువు గర్భంలో మెరక ప్రాంతంలో 40 ఏళ్ల కిందట నాటిన నల్లతుమ్మ మొక్కలు ఇప్పుడు భారీ వృక్షాలుగా ఎదిగాయి. ఆ చెట్లపై కలప దొంగల కన్నుపడింది. చూస్తుండగానే ఆ చెట్లు మొత్తాన్ని కొల్లగొట్టేయడంతో పంచాయతీకి రూ.లక్షల్లో నష్టం కలిగింది. ఐదేళ్ల కిందట ఈ చెట్లను విక్రయించడానికి అనువుగా పంచాయతీ అనుమతులు తీసుకుని వేలం వేయాలని నిర్ణయించింది. అప్పట్లోనే రూ.అరకోటి పైగా ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో వేలం వాయిదా పడింది. అయినా వైసీపీ ప్రభుత్వ పాలన చివరి రోజుల్లో కలప దొంగలు చీకటిమాటున చెట్లను నరికి తరలించారు. అప్పట్లో కలప తరలిస్తున్న కొన్ని ట్రాక్టర్లను పట్టుకోగా, ఆ కలపను అక్కడకు సమీపంలోనే దించేసి, వెళ్లిపోగా ఆ కలప ఇప్పటికీ అక్కడే ఉంది. దొంగలెవ్వరో తెలిసినా వారిపై ఇప్పటికీ ఏ చర్యలు తీసుకోలేదని కన్నసముద్రం నీటిసంఘం అధ్యక్షుడు ఆలూరి గంగాధరరావు, గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు బలుసు శ్రీనివాస చౌదరి, గ్రామస్థులు చిలకల పూడి బాలవెంకట సత్యనారాయణ, బలుసు సుజాన్, వెంకటేశ్వరరావు, మల్లిఖార్జున రావు, గారపాటి సతీష్, చదలవాడ నరేష్, నందిగం సురేష్, చిలకలపూడి నాగేశ్వరరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చెరువులో చెట్ల నరికివేతపై నిఘా పెట్టకపోతే మిగిలిన కొద్ది పాటి చెట్లు కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లతుమ్మచెట్లతో కన్నసముద్రం అడవిలా ఉండేదని, గొర్రెలు, మేకలు, పశువులకు ఆహారాన్ని అందించే వనరుగా, నీడనిస్తూ ఉండేదని, ఇప్పుడు మేతతోపాటు నీడ కరువైందని పశువుల కాపరులు వాపోతున్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేసినా..



కన్నసముద్రం చెరువులో విలువైన నల్లతుమ్మ చెట్లను అక్రమంగా నరికేస్తూ తరలించు కుపోతున్నారు. దీనిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు రెండేళ్ల నాడే ఫిర్యాదు చేశా. ఇప్పటికీ ఏ చర్యలు తీసుకోలేదు. కలప అక్రమ నరికివేతను అడ్డుకోకపోతే మిగిలిన చెట్లూ కలప దొంగల పాలయ్యే అవకాశం ఉంది.

- బాబ్జి, గ్రామ కార్యదర్శి, ముండూరు



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అస్మి, ఎమ్మెల్యే ఆరిమిల్లి

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తణుకు, మార్చి 12(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తణుకులో పర్యటించనున్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం - పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించండి' అనే థీమ్‌తో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ మేరకు జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి పరిశీలించారు. ముళ్ళపూడి వెంకటరాయ పాలిటెక్నిక్ ప్రాంగణంలో హెలీప్యాడ్, ఆడిటోరియం, బాలికోన్నత పాఠశాలలో వాహనాల పార్కింగ్, జడ్పీ బాలురున్నత పాఠశాలలో ప్రజావేదిక, స్టాల్స్ ప్రదర్శన, స్వచ్ఛ భారత్ నిర్వహణకు మహిళా కళాశాల వద్ద కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో యుద్ధ ప్రాదిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తణుకు కమిషనర్ రామ్‌కుమార్, జేసీ టి.రాహుల్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందర్తి వెంకటేష్, అడిషినల్ ఎస్పీ భీమారావు పాల్గొన్నారు.



ఆంధ్రా షుగర్స్‌లో కార్మికులకు బహుమతులు అందిస్తున్న ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

భద్రతా నియమాలు పాటించాలి

తణుకు, మార్చి 12(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ నిబంధనల మేరకు కార్మికులు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వెంకటరాయపురం ఆంధ్రా సుగర్స్ ప్రాంగణంలో జరిగిన జాతీయ భద్రతా వారోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాల వల్లే జరుగతున్నాయని చెప్పారు. కార్మికులకు శిక్షణ ఇవ్వడం ద్వారా పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా నిరోధించవచ్చని తెలిపారు. గతేడాది ఒక్క రిపోర్టబుల్ ప్రమాదం కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకున్న ఆంధ్రా సుగర్స్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఏటా మార్చి 4 నుంచి 10 వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) సాంబశివరావు కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. వారోత్సవాల సందర్భంగా కార్మికులకు తిమ్మరాజు స్కూలు, ముళ్ళపూడి వెంకటరాయ మెమోరియల్ పాలిటెక్నిక్ కాలేజి విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. లేబర్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.శ్రీనివాసు, వివిధ విభాగాల అధిపతులు, కార్మికులు పాల్గొన్నారు.



దేనికెంత ?

రైల్వే బడ్జెట్ కేటాయింపులపై వీడని సస్పెన్స్

నరసాపురం-మచిలీపట్నం కొత్తలైన్‌కు ఎంత ?

నత్తనడకన సాగుతున్న కోటిపల్లికి నిధులెన్ని ?

బడ్జెట్ సమావేశం జరిగి 35 రోజులు పూర్తయినా విడుదల కాని రైల్వే పింక్ బుక్

(నరసాపురం-ఆంధ్రజ్యోతి):

ఈసారి రైల్వే బడ్జెట్‌పై జిల్లావాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొత్తగా ప్రతిపాదించిన నరసాపురం-మచిలీపట్నం రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారని, కోటిపల్లికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపు ఉంటుందని ఆశతో ఎదురుచూశారు. బడ్జెట్ సమావేశాలు ముగిసి 40 రోజులవుతోంది. నేటికి ఏ ప్రాజెక్టుకు ఎంత కేటాయించారన్నది స్పష్టత లేదు. రాష్ట్రానికి రూ.9,417 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. కాని, ఏ ప్రాజెక్టుకు ఎంతన్నది ఇంత వరకు వెల్లడించలేదు. బడ్జెట్ కేటాయింపులపై రైల్వే శాఖ విడుదల చేసే పింక్ బుక్ రాలేదు. దీంతో కేటాయింపులు సస్పెన్స్‌గా మారాయి.

పడకేసిన కోటిపల్లి లైను

2015లో కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు నత్తనడకనసాగింది. ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా మొత్తంలో కనీసం ఒక్క రూపాయి చెల్లించలేదు. దీంతో ప్రాజెక్టు పనులు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మిగిలింది. రైల్వే బడ్జెట్‌లో కేటాయించిన నిధులతోనే పనులు చేస్తూ వచ్చారు. 71 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ కొత్తలైన్‌లో మూడుచోట్ల గోదావరిపై భారీ వంతెనలు పూర్తిచేశారు. ఇంకా కోనసీమ జిల్లాలో భూసేకరణ చేయాలి. ఇప్పటి వరకు రూ.1500 కోట్లుపైనే రైల్వే కేటాయించింది. ఇంకా రూ.1000 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు పెద్ద మొత్తంలో నిధులు వస్తాయని ఎదురుచూశారు. కానీ ఎంత కేటాయించారన్నది సస్పెన్స్‌గా మారింది. రైల్వే ఉన్నతాధికారులకు దీనిపై క్లారిటీ లేదు. పింక్ బుక్ వస్తే గాని తెలియదంటూ దాటేస్తున్నారు.

మచిలీపట్నం లైన్‌కు ఏదీ స్పష్టత

నరసాపురం-మచిలీపట్నం మధ్య నిర్మించే కొత్త రైల్వేలైన్‌కు సంబంధించి డీపీఆర్ పూర్తయింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తారని కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ వెల్లడించారు. ఇంత వరకు స్పష్టత లేదు. అసలు ఈ ప్రాజెక్టుకు రైల్వే పచ్చజెండా ఊపిందా లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. నరసాపురం-విజయవాడ, భీమవరం-నిడదవోలు మధ్య చేపట్టిన డబ్లింగ్ లైన్‌లో ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఎదురుచూశారు. కానీ వాటి పైన స్పష్టత కనిపించలేదు. ఈ సస్పెన్స్ వీడాలంటే పింక్ బుక్ విడుదల కావాల్సిందే .

సమస్యలపై రోడ్డెక్కనున్న ల్యాబ్ టెక్నీషియన్లు



వైసీపీ ప్రభుత్వం వాడుకుని వదిలేసిందని ఆవేదన

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో 400 మందికిపైగా ఎల్టీలు

ఏలూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి):రోగ నిర్ధారణలో కీలకపాత్ర పోషించే ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలపై ప్రభుత్వం పరిష్కార చర్యలు చేపట్టాలని అభ్యర్థిస్తూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 92 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 9 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, 3 ఏరియా ఆస్పత్రులు, ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఏపీ సాక్స్ నిర్వహించే ఎయిడ్స్ ఏఆర్టీ సెంటర్లు, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. మార్చి 13న ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల వద్దకువెళ్ళి వినతిపత్రాలు అందజేసి తమకు న్యాయం చేయాల్సిందిగా అభ్యర్థి స్తామని ల్యాబ్ టెక్నీషియన్ల సంఘం నాయకుడు ఆనంద్ ఒక ప్రకటనలో వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ల్యాబ్ టెక్నీషియన్ల సేవలను కొవిడ్, తదితర విపత్కర పరిస్థితుల్లో రేయింబవళ్లు తమ సేవలను వినియోగించుకుని, నిబంధనల మేరకు కనీసం ఒక్కరికీ పదోన్నతులు, ఇతర ఉద్యోగ ప్రయోజనాలను ఇవ్వకుండా మోసం చేసిందని ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రులో 400 మందికి పైగా ల్యాబ్ టెక్నీషియన్లు విధులు నిర్వర్తిస్తున్నారని, గ్రేడ్-2 హోదాలో పనిచేస్తున్న ప్పటికీ తమకు పదోన్నతులు కల్పించకుండా, మిగతా అన్ని కేడర్ల వైద్య ఉద్యోగులకు గెజిటెడ్ హోదావరకు ఉద్యోగోన్నతులు కల్పించడం ఎంత వరకు సబబని ఆయన ప్రశ్నించారు. అన్ని రాష్ట్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్లను డయా గ్నొస్టిక్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్‌లుగా పరిగణిస్తుండటం వల్ల అన్ని ప్రయోజనాలు లభిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఎల్టీలుగా పనిచేస్తున్నవారిలో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విదానాల్లో నియమితులై గ్రాడ్యుయేషన్, పీజీ, పీహెచ్‌డీ విద్యార్హతలతో ఉన్నప్పటికీ ఎనలిస్టు, కెమిస్టు పోస్టులను ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు ఇవ్వడంద్వారా భర్తీచేయడం లేదని ఆరోపించారు. ఎల్టీల సర్వీసులను జోనల్ కేడర్‌గా మార్చుచేసి, అన్ని పీహెచ్‌సీల్లో రెండో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇరుకుగా వున్న ల్యాబ్‌ల విస్తీర్ణాన్ని పెంచి, ఆధునికీకరించాలని కోరారు. గత ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీ, ఉన్నతాదికారుల బృందంచేసిన సిఫారసుల మేరకు కొత్తగా ఎల్టీ గ్రేడ్-2 కేడర్ పోస్టులను 25శాతం, గ్రేడ్-1 కేడర్ పోస్టులను 10 శాతం పెంచాలని, అపుడే డయాగ్నోస్టిక్ సేవలు పటిష్టమవు తాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఏపీవీవీపీ, వైద్యవిద్య డైరెక్టరేట్ విభాగాల్లో నిలిపివేసిన కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగుల క్రమబద్దీకరణను పూర్తిచేసి ఆర్డర్లను ఇప్పించాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్ స్వర్ణలతకు ఊరట

హైకోర్టు ఉత్తర్వులతో తిరిగి బాధ్యతల స్వీకరణ

ద్వారకాతిరుమల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయిన ద్వారకా తిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలతకు హైకోర్టు ఊరటనిచ్చింది. ఈమె దాఖలు చేసిన రిట్ పిటీషన్‌పై తదుపరి విచారణ ముగిసే వరకూ సర్పంచ్‌గా కొనసాగవచ్చని గతేడాది అక్టోబరు 26న మధ్యంతర ఉత్తర్వులను ఇచ్చింది. దీంతో ఆ ఉత్తర్వుల మేరకు తిరిగి బాధ్యతలను స్వర్ణలతకు అప్పగిస్తూ కలెక్టర్ తాజాగా ఆర్డర్ జారీచేశారు. దీంతో సస్పెన్షన్‌లో ఉన్న స్వర్ణలత బుధవారం ద్వారకా తిరుమల సర్పంచ్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టారు.

ద్వారకాతిరుమలకు చెందిన నిమ్మగడ్డ అముక్త గతేడాది జనవరి 29న స్పందనలో ద్వారకా తిరుమల పంచాయతీలో ఆర్థిక అవకతవకలు జరిగాయని పిటీషన్ దాఖలు చేసింది. దీనిపై కలెక్టర్ 2024 ఫిబ్రవరి 5న జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవోను విచారణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విచారణాధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా సర్పంచ్ స్వర్ణలత అధికార సమయంలో రూ.53,57,376 దుర్వినియోగం అయినట్టు నిర్ధారించడంతో 2024 జూలై 29న షోకాజ్ నోటీస్ జారీచేశారు. ఆరునెలలు సస్పెండ్ చేస్తున్నట్లు, సర్పంచ్ దుర్వినియోగం చేసిన రూ.53,57,376 సొమ్మును 15 రోజుల్లో రికవరీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాను



ద్వారకాతిరుమల సచివాలయంలో సర్పంచ్‌గా బాధ్యతలు చేపడుతున్న స్వర్ణలత

ఎటువంటి అవకతవకలకు పాల్పడలేదని తనపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సర్పంచ్ కోరడంతో డీఎల్పీవోకు కలెక్టర్ సెప్టెంబరు 17న మెమో జారీ చేస్తూ సర్పంచ్ ఇచ్చిన వివరణలోని వాస్తవాల కోసం పంచాయతీ రికార్డులను తనిఖీ చేయాలని కాల్‌ఫర్ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డుల ప్రకారం సర్పంచ్‌పై షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్న ఆరోపణలు అన్నీ వాస్తవమేనని స్పష్టం చేశారు. దీంతో సర్పంచ్‌ను ఆరునెలల పాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు.కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేయాలని స్వర్ణలత హైకోర్టులో ఫైల్ చేశారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు విచారణ ముగిసే వరకూ ఈమె సర్పంచ్‌గా కొనసాగవచ్చని 2024 అక్టోబరు 26న ఉత్తర్వులు ఇచ్చింది.

నేడు, రేపు వేడిగాలులు



ఏలూరుసిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురు, శుక్రవారాల్లో వేడి గాలులు(హీట్ వేవ్స్) తీవ్రంగా వీస్తాయని ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ తెలిపింది. ఏలూరు జిల్లాలోని ఈ నెల 13వ తేదీ గురువారం 19 మండలాల్లోను, 14వ తేదీ శుక్రవారం 16 మండలాల్లోను వేసవి వేడిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. ఏలూరు జిల్లాలో 13న అత్యధికంగా ఆగిరిపల్లి మండలంలో 41.8 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదవుతుందని, భీమడోలు, బుట్టాయిగూడెం, దెందులూరు, ద్వారకాతిరుమల, ఏలూరు, గణపవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు, మండవల్లి, ముసునూరు, నిడమర్రు, నూజివీడు, పెదవేగి, పెదపాడు, పోలవరం, ఉంగుటూరు, వేలేరుపాడు మండలాల్లో వేడిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపింది.

14వ తేదీ శుక్రవారం వేలేరుపాడు మండలంలో 41.5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు అవుతుందని, ఆగిరిపల్లి, భీమడోలు, బుట్టాయిగూడెం, ద్వారకాతిరుమల, ఏలూరు, గణపవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కుక్కునూరు, మండవల్లి, నిడమర్రు, పెదవేగి, పెదపాడు, పోలవరం, ఉంగుటూరు మండలాల్లో వేడిగాలుల ప్రభావం అధికంగా ఉంటుందని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది. మధ్యాహ్న సమయంలో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు మానుకోవాలని కోరింది.

ఇద్దరు కార్యదర్శులపై కేసు

భీమవరం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం చిన అమిరంలో పని చేసిన ఇద్దరు కార్యదర్శులపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ ఇజ్రాయేల్ తెలిపిన వివరాల ప్రకారం ప్రస్తుతం చిన అమిరం కార్యదర్శిగా పని చేస్తున్న కె.దుర్గాప్రసాద్ పంచాయతీ సొమ్ము దుర్వినియోగం జరిగాయంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాలతో విచారణ జరిపారు. ఎస్.కె.జి.కృష్ణంరాజు, జి.రామకృష్ణ ఇద్దరూ రూ.3 కోట్ల 71 లక్షల 85 వేల 720 దుర్వినియోగానికి పాల్పడినట్లుగా తేలడంతో కేసు నమోదు చేశామన్నారు.

మాజీ కార్యదర్శుల అరెస్టు..

రాయలంలో గతంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన ఇద్దరు వ్యక్తులు పంచాయతీ సొమ్మును దుర్వినియోగం చేశారని ప్రస్తుత కార్యదర్శి దేవరపు సూర్య పద్మాజీరావు ఫిర్యాదుతో జిల్లా కలెక్టర్ నాగరాణి విచారణకు ఆదేశించారు. దీంతో ఆడిట్ ఆఫీసర్ విచారణ చేసి రూ2 కోట్ల 9 లక్షల 29వేల 758 రూపాయలు దుర్వినియోగమైనట్టు నిర్ధారించారు. దీంతో ప్రస్తుతం మొగల్తూరు మండలం ముత్యాలపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్.కె.జి.కృష్ణంరాజు, యలమంచిలి మండలం చించినాడ కార్యదర్శిగా పని చేస్తున్న డి.జయరాజులను భీమవరం డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ కాళీచరణ్ తెలిపారు.

చంపుతానని బెదిరింపులు

భీమవరం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే చంపుతానని ఓ వ్యక్తిని బెదిరించిన ఘటన భీమవరం రెండవ పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టూటౌన్ ఏఎస్ఐ ధర్మారావు తెలిపిన వివరాల ప్రకారం వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన హత్యాయత్నం కేసులో చిత్రజల్లు గోపీ కిషోర్ అనే వ్యక్తి మూడవ సాక్షిగా ఉన్నాడు. కొంత కాలంగా కోర్టులో వాయిదాలకు వస్తున్నాడు. 11వ తేదీన కోర్టుకు రావడంతో సాయంత్రం వరకు వాయిదా వేయడంతో గోపీ కిశోర్ బయటకు వచ్చేశాడు. అయితే అదే కేసులో నిందితుడిగా ఉన్న రొంగల అరుణ్ కుమార్ గోపీకిశోర్‌ను బెదిరించడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ధర్మారావు తెలిపారు.

వరుస ప్రమాదాలతో హడల్..

ఏలూరు సమీపంలో మరో రెండు బస్సు ప్రమాదాలు - 12 మందికి గాయాలు

ఏలూరు క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరు సమీపంలో జరుగుతున్న వరుస ప్రమాదాలతో ప్రయాణికులు హడలిపోతున్నారు. ఈనెల 6న ప్రైవేటు ట్రావెల్ బస్సు లారీని ఢీ కొట్టగా నలుగురు మరణించారు. 10న ఆశ్రం ఆసుపత్రి వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సు అతి వేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్ట డంతో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలు మరువక ముందే బుధవారం తెల్లవారు జామున రెండు ఆర్టీసీ బస్సు లు వేర్వేరు చోట్ల ప్రమాదానికి గురయ్యాయి. ఈ ప్రమా దాల్లో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ నుంచి గుంటూరుకు మంగళవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు బయ లుదేరింది. బుధవారం తెల్లవారు జామున 4.30 గంటల ప్రాంతంలో ఏలూరు మెయిన్ బైపాస్ రామచంద్ర ఇంజనీ రింగ్ కాలేజీ వద్ద ఆయిల్ డబ్బాల లారీని వెనుక నుంచి బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ముగ్గురికి పళ్లు ఊడిపోయాయి. ప్రమాద సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందు తున్న క్షతగాత్రులు ఇట్టి సత్యసాయి (కాకినాడ), కర్రి హారిక (రావులపాలెం), వెల్ల రాజు (మాచవరం), కడియం రామశివుడు (కాకినాడ), కొర్ల సుబ్రహ్మణ్యం (కాకినాడ), కొత్తల వెంకట లక్ష్మి(రామచంద్రపురం), కఠారి శిరీష్ (కాకినాడ), ఆరేపల్లి సాయిదుర్గ ప్రసాద్ (తణుకు), వడిత దత్తు నాయక్ (మాచర్ల), జిగిలింగ పవన్‌కుమార్ (కాకినాడ), ఆకుల శేష (కడియపులంక), రూపేంద్ర గాంధీలు తీవ్రంగా గాయపడ్డారు.ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందు తున్న క్షతగాత్రులను ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు పరామ ర్శించారు. ఈ సంఘటనపై త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీలోని ఆయిల్ రెండు డబ్బాలు పగిలిపోవడంతో ఆ ప్రాంతమంతా ఆయిల్ పడి పోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగ కుండా పోలీసులు చర్యలు చేపట్టారు. క్రేన్లతో లారీ, బస్సును రోడ్డు పక్కకు తీయించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.



గురుకుల పాఠశాల సమీపంలో బస్సును ఢీకొట్టిన లారీ



ఇంజనీరింగ్ కళాశాల వద్ద ప్రమాద స్థలంలో బస్సు, లారీ

బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ

విశాఖపట్టణం నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును బుధవారం తెల్లవారు జామున ఏలూరు మెయిన్ బైపాస్ గురుకుల పాఠశాల సమీపంలో కంటైనర్ లారీ ఢీకొట్టింది. లారీని బస్సు ఎడమవైపు నుంచి సైడ్ చేస్తుం డగా అకస్మాత్తుగా లారీ కూడా ఎడమవైపునకు వచ్చి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ఇంజన్ ముందు భాగం నుజ్జునుజ్జయింది. బస్సు కూడా కొంత భాగం ధ్వంసమైంది. ఆ బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులు సురక్షితంగానే బయటపడ్డారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. దీంతో ఆయా ప్రయాణికులు గమస్యస్థానాలకు చేరారు.

యజమానికి తెలియకుండా ఆస్తుల తనఖా

పాలకొల్లులో బ్యాంకు వద్ద బాధితుల ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు

పాలకొల్లు టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి):తక్కువ వడ్డీకి రుణం ఇప్పిస్తానంటూ ఒక బ్యాంక్ ఉద్యోగిని తమ వద్ద రూ.4 కోట్లు విలువైన ఆస్తిని కాజేసిందని ఆరోపిస్తూ బాధితులు పాలకొల్లులో యూనియన్ బ్యాంక్ వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లవానిచెరువుకు చెందిన బలే శ్రీనివాసరావు, అతని భార్య జయలక్ష్మిలకు గ్రామంలో సొంత డాబా, 1200 గజాల స్థలం, 2.5 ఎకరాల పొలం ఉన్నాయి. శ్రీనివాసరావు తన పొలాన్ని వడ్లవానిపాలెంకు చెందిన మురళీకృష్ణంరాజుకు రొయ్యలసాగుకు లీజుకిచ్చారు. శ్రీనివాసరావు భార్య జయలక్ష్మి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. తన చిల్లర బాకీల కోసం రుణం కావాలని కృష్ణంరాజును శ్రీనివాసరావు డబ్బులు అడిగాడు. తన భార్య మాధవీలత బ్యాంక్‌లో మేనేజరుగా పని చేస్తోందని, తక్కువ వడ్డీకే రుణం ఇప్పిస్తానని నమ్మబలికి శ్రీనివాసరావు నుంచి డాబా, 12 గజాల స్థలం, అర ఎకరం భూమికి సంబంధించిన దస్తావేజులను కృష్ణంరాజు తీసుకున్నాడు. రిజిస్ట్రారు కార్యాలయానికి వచ్చి హామీ సంతకం చేయాలని చెప్పడంతో పెద్దగా చదువురాని బాధితుడు శ్రీనివాసరావు వచ్చి చెప్పినచోట సంతకాలు చేశాడు. కృష్ణంరాజు మొత్తం ఆస్తిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని స్థానిక ఐసిఐసిఐ బ్యాంక్‌లో రూ.50 లక్షల రుణం తీసుకున్నాడు. ఇదేమీ తెలియని బాధితుడి ఇంటిని మూడు నెలల క్రితం ఐసిఐసిఐ బ్యాంక్ అధికారులు జప్తు చేశారు. బాధితుడి భార్య జయలక్ష్మి పేరుతో ఉన్న రెండెకరాలకు సంబంధించిన దస్తావేజులు తీసుకుని మురళీ కృష్ణంరాజు ప్రైవేటుగా మరొకరికి హామీ పెట్టి అప్పు తెచ్చుకుని వాడుకున్నాడు. ఈ మొత్తం వ్యవహారం తెలిసిన బాధితులు తమకు న్యాయం చేయాలంటూ పాలకొల్లు పట్టణ, రూరల్ పోలీసులను ఆశ్రయించారు. మురళీ కృష్ణంరాజు భార్య మాధవీలత నమ్మబలికి సాటి మహిళలు అని చూడకుండా తన ఆస్తిని భర్తతో కలిసి కాజేసిందని జయలక్ష్మి విలేకరుల వద్ద వాపోయింది. తమ ఆస్తిని కాజేసిన మురళీకృష్ణంరాజుపైనా, బ్యాంక్ ఉద్యోగిని మాధవీలత పైనా చర్యలు తీసుకుని తమ ఆస్తిని తమకు అప్పగించాలంటూ పోలీసులకు, మంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తిచేశారు. కాగా మురళీ కృష్ణంరాజు, మాధవీలతలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాలకొల్లు పోలీసులు తెలిపారు.



పాలకొల్లులో బ్యాంక్ వద్ద బాధితుల ఆందోళన

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

ఉంగుటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : రాచూరు గ్రామంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మిరియాల చంద్ర శేఖర్(22) చేపల చెరువులపై కాపలా ఉంటున్నాడు. బుధవారం చెర్వు వద్దకు పనికి వెళ్లాల్సి ఉండగా ఇంట్లో ఉరి వేసుకుని కనిపించాడు. దీనిపై చేబ్రోలు పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బహిర్భూమికి వెళ్తే రైలు ఢీకొని గాజుల వ్యాపారి మృతి

ఏలూరు క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి):గాజుల వ్యాపారి రైలు పట్టాల వద్దకు బహిర్భూమికి వెళ్లగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. బీహార్‌కు చెందిన జార్జీస్ ఆలామ్ ఏలూరు పవర్‌పేట లో బ్రిడ్జి సమీపంలో శ్రీనివాస థియేటర్ గ్రౌండ్‌లోని క్రాఫ్ట్ బజార్‌లో గాజుల వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం ఉదయం ప్రమాదం జరగడంతో సమాచారం అందడంతో ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు.

పోక్సో కేసులో జీవిత ఖైదు, జరిమానా


నరసాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు పేడారి నర్సింహరాజుకు జీవిత ఖైదీ, రూ.50 వేలు జరిమానా విధిస్తూ బుధవారం భీమవరం పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. కేసుకు సంబంధించి నరసాపురం టౌన్ సీఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో బాలికపై అత్యాచారం జరిగినట్టు 2017లో టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై అప్పటి ఎస్సై చంద్రశేఖర్ విచారించి కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణలో అరుం ధతీపేటకు చెందిన నర్సింహరాజును అదుపులోకి తీసుకుని పోలీసుల ఛార్జిషీట్‌లో పేర్కొన్న 18 మంది సాక్షుల్ని కోర్టులో విచారించారు. నిందితుడు నేరం చేసినట్టు రుజువు కావడంతో న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ జీవితకాల ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

గాయపర్చిన వ్యక్తికి మూడేళ్ల జైలు

పెదపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి):పొలం సరిహద్దు విషయంలో జరిగిన ఘర్షణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏలూరు మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ మూడేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధించినట్లుగా పెదపాడు ఎస్.ఐ కట్టా శారద సతీష్ తెలిపారు. 2020 నవంబరు 17న పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన శివరామకృష్ణ పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లగా సరిహద్దు పొలం రైతు సబ్బా గోవర్ధన్ గొడవపడి శివరామకృష్ణను తీవ్రంగా గాయపర్చాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న అప్పటి ఎస్సై జ్యోతిబస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నేరం రుజువయ్యాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్ హేమలత వాదనలు విన్పించారు.

'ఐటీ సోదాలతో 3 ఎఫ్ ఇండస్ట్రీస్‌కి సంబంధం లేదు'

పెంటపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన ఐటీ సోదాలు తమ 3ఎఫ్ ఇండస్ట్రీస్‌కి సంబం ధించినవి కాదని జీఎం- హెచ్‌ఆర్ జె.జనార్దన్, జీఎం-ఎకౌంట్స్ ఎం.ఎస్.వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఇండస్ట్రీస్ వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిర్వాహ కులు మాట్లాడుతూ ముంబై పార్లే ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కొన్నేళ్లుగా 3ఎఫ్ ఇండస్ట్రీస్ నుంచి పామాయిల్ కొనుగోలు చేస్తోందన్నారు. పార్లే కంపనీలో ఐటీ సోదాలు జరిగాయని దానిలో భాగంగానే 3 ఎఫ్ ఇండస్ట్రీస్‌కు వచ్చారన్నారు. వచ్చిన అధికారులకు అన్ని రకాలుగా సహకరించామని జరిగిన ఐటీ సోదాలకు ఇండస్ట్రీస్‌కి ఎలాంటి సంబంధం లేదన్నారు.



జీఎంలు జనార్దన్, వేణుగోపాల్

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ మోసం

భీమవరం క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : తన క్రెడిట్ కార్డు లిమిట్‌ను పెంచుతామంటూ ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు మోసం చేశారంటూ రేవు జగన్ మోహన్ అనే వ్యక్తి టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. జగన్ మోహన్‌కు గత నెల 26న ఒక అగంతకుడు ఫోన్ చేసి క్రెడిట్ కార్డుల లిమిట్ పెంచుతామంటూ నమ్మించడంతో జగన్ మోహన్ ఆన్‌లైన్ లింక్‌ను క్లిక్ చేశాడు. దీంతో అతని అకౌంట్‌లోని రూ. 3 లక్షల 48 వేల 428 మాయమవడంతో ఖంగుతిన్న జగన్ మోహన్ టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ శ్రీనివాస్ తెలిపారు.

భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయాలి

భీమడోలు,మార్చి 12(ఆంధ్రజ్యోతి) : భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపాలని విశ్రాంత హెచ్ఎం తుమ్మల ఉమా మహేశ్వరరావు బృందం కోరింది. బుధవారం ఏలూరు రైల్వే స్టేషన్‌కు విచ్చేసిన జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌కు వినతి పత్రం అందజేశారు.భీమడోలు రైల్వే స్టేషన్ నుంచి ద్వారకా తిరుమల చుట్టు పక్కల 40 గ్రామాల ప్రజలకు సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పండ్రకి వెంకట్, ఆర్బీఎం.ప్రసాద్,భోగరాజు రామారావుమరడా సత్యనారాయణ ఉన్నారు.

నేటి నుంచి సరమ్మతల్లి పేరంటాలమ్మ తిరునాళ్లు

లింగపాలెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): లింగపాలెంలో సరమ్మతల్లి పేరంటాలు అమ్మవారి తిరునాళ్లు గురువారం నుంచి ప్రారంభవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తాతినరాధా కృష్ణ తెలిపారు. అమ్మవారి అగ్నిగుండ ప్రవేశంతో ఈ తిరునాళ్ల ప్రారంభమవుతాయన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ తిరునాళ్లలో వేలాది మంది భక్తులు వచ్చి తమ మొక్కు బడులు ల్లించుకునేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు ఆయనతెలిపారు.

నష్టపోయిన టీచర్లకు బదిలీల్లో ప్రాధాన్యతనివ్వాలి

ఏలూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో రేషనలైజేషన్ వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు త్వరలో చేపట్టనున్న సాదారణ బదిలీల్లో ప్రాధాన్యతనివ్వాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు డిమాండ్‌చేశారు.వివిధ కారణాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయన్న వాస్తవాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఉద్యోగ విరమణకు దగ్గర్లో ఉన్నవారు, అంధ ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ జాబితాల్లో తప్పులను సరిచేసి నిబంధనల ప్రకారం సక్రమమైన లిస్టులను విడుదల చేసేందుకు డీఈవో చర్యలు చేపట్టాలన్నారు.

బోదకాలు క్లీనింగ్‌కు కిట్ల పంపిణీ

ఏలూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : బోదకాలును క్లీన్‌చేసుకునేందుకు మేనేజ్‌మెంట్ కిట్లను బుధవారం 24మంది బోదవ్యాధిగ్రస్థులకు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని అందజేశారు. ఈ మేరకు ఆమె బోదవ్యాధి గురించి మాట్లాడుతూ ఈ వ్యాధికి మందులులేవని, కేవలం పరిశుభ్రత ఒక్కటే మార్గమని వివరించారు. శుభ్రంగా ఉంటే బోదకాలుపై ఇతర ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయన్నారు. బోదకాలు క్లీన్ చేసుకునే విధానాన్ని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు వివరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్, వైద్యాధికారులు గౌతమ్, రోహిత్, భార్గవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా విద్యార్థినులకు బహుమతులు

ఏలూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్‌మెంట్ విద్యార్థులకు నిర్వహించిన 'ప్రేరణ ఫెస్ట్'లో స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల బీబీఏ విద్యార్థినులు బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తెలిపారు. బి-క్విజ్, యాడ్-మ్యాడ్, యంగ్ మేనేజర్, స్పాట్ ఈవెంట్, కల్చరల్ ఈవెంట్, గేమ్‌జోన్, తదితర పోటీల్లో విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు సూచనలు

పెదపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి):ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించేలా టెన్త్ పరీక్షలు రాయాలని పెదపాడు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాడు జడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో అనుసరించాల్సిన జాగ్రత్తలు, సూచనల గురించి బుధవారం వివరించారు. హెచ్.ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజూ చదివిన పాఠ్యాంశాలను మననం చేసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రంలో క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజువల్లి చాలెంజెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎంపిక

ఏలూరుటూటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : విజువల్లి చాలెంజెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గిరిజన భవన్‌లో ఎన్నికల అధికారి అలీ ఎన్నికలు నిర్వహించారు. 26 పోస్టులకు 26 నామినేషన్లు రావడంతో అంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షునిగా రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా జలంధర్ రెడ్డి, కోశాధికారిగా సి.హెచ్.జ్యోతి, కార్యనిర్వాహక కార్యదర్శి సంధ్యారాణి, ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, సలహాదారుగా గురు ప్రసాద్, మహిళా కార్యదర్శిగా శైలజ ఎన్నికవగా వీరిని పలువురు అభినందించారు.

బుద్ధగయ పరిపాలన బౌద్ధ భిక్షువులకే అప్పజెప్పాలి

ఏలూరుటూటౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో బుద్ధగయ టెంపుల్ పరిపాలన బౌద్ధభిక్షవులకే అప్పజెప్పాలని భారతీయ బౌద్ధమహా సభ రాష్ట్ర అధ్యక్షులు బేతాళ సుదర్శన్ డిమాండ్ చేశారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ 1949 బుద్దగయా టెంపుల్ బీటీ యాక్ట్‌ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రితీష్ కుమార్ రద్దు చేయడాన్ని వ్యతిరేకించారు. ఈ యాక్ట్‌ను పునరుద్ధరించి టెంపుల్‌ను బౌద్ధభిక్షవులకే అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

చింతలపూడి, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్‌ల సేవలు మరింత విస్తృతం కావాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ పాకరాల వేణుబాబు అన్నారు. బుధవారం చింతలపూడి లయన్స్ ఆధ్వర్యంలో జోన్ ఎడ్వైజరీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా లక్ష రూపాయలు విలువ చేసే సహాయాలు అందజేశారు. ఇందులో 25 మంది పేద మహిళలకు వస్త్రాలు, అనస్తీసీషియా కోర్సు చదువుతున్న బేగం అనే విద్యార్థినికి ఫీజుల నిమిత్తం పది వేలు, క్యాన్సర్ విద్యార్థికి ఐదు వేలు, రాఘవాపురం మహిళకు కుట్టుమిషన్, అదే గ్రామంలో ఇల్లు కాలిపోయిన బ్రాహ్మణ కుటుంబానికి 25 వేల ఆర్థిక సహాయం, రెండు సిమెంటు బెంచీలు అందజేశారు.

150 మంది గిరిజనులకు ఉచిత వైద్యం

పోలవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ప్రతి గిరిజనుడు బిర్సా ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలని ఓఎన్జీసీ చీఫ్ జనరల్ మేనేజర్ మురుగేశన్ అన్నారు. బుధవారం ఐటీడీఏస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ సౌజన్యంతో రాజమహేంద్రవరం గౌతమీ నేత్రాలయ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సమావేశంలో మురుగేశన్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏస్ చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. గిరిజనులకు ఆధ్యుడైన బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని వైద్య శిబిరం నిర్వహించి 500 మంది గిరిజనులు, గిరిజనేతరులు ఉచిత వైద్య సేవలు అందజేసినట్టు మురుగేశన్ తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలివెళ్లండి : మదన్

భీమడోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో మార్చి 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి భారీగా జనసైనికులు తరలి వెళ్లాలని భీమడోలు మండల పార్టీ జనసేన అధ్యక్షులు ప్రత్తి మదన్ పిలుపునిచ్చారు. భీమడోలులో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి ఆవిర్భావ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు తరలి వెళ్ళాలని పిలుపునిచ్చారు.

టెన్త్ పరీక్షలపై సోషల్ మీడియాలో రూమర్లు వద్దు

ఏలూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు హాజరయ్యే బాలబాలికలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా ఆర్టీసీ బస్సులను రీషెడ్యూల్ చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫ రెన్సులో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో ఏర్పాట్లను వివరించారు. పరీక్షల్లో చూచిరాతలు జరుగకుండా కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. ప్రశ్నపత్రాలు భద్రపరిచే కేంద్రాల్లో సీసీ కెమేరాలు అమర్చాలని ఆదేశించారు. సీపీవో వాసుదేవరావు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, డీపీఈవో ప్రభాకరరావు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధూమపానంతో క్యాన్సర్ ముప్పు

జంగారెడ్డిగూడెం(ఏలూరు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ధూమపానం వల్ల క్యాన్సర్ వస్తుందని సైకాలజిస్టు కేసీహెచ్.వీర్రాజు విద్యార్థులకు సూచించారు. బుధవారం పాఠశాలలో ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హెచ్ఎం. కెఎస్‌వి.లోవ కుమారి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పనిచేస్తున్న సైకాలజిస్టు డా.కెసిహెచ్. వీర్రాజు విచ్చేశారు. దూమపానం వల్ల కలిగే అనర్థాలపై హెచ్ఎం. కెఎస్‌వి.లోవ కుమారి సూచించారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే ముఖ్యం

ఏలూరుటూటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే ముఖ్యమని నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ అన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీల్లో పని చేసే కార్మికులకు సంబంధించిన వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భానుప్రతాప్ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ యూజీడీ కార్మికులు 26 మంది విధులు నిర్వహించేటప్పుడు వ్యాధులు రాకుండా సంబంధిత కిట్‌లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, డీఈ రజాక్, ఏఈ సాయి, సూపర్‌వైజర్ దాసు, కార్పొరేటర్లు ఎస్.శ్రీనివాస్, రాము, తదితరులు పాల్గొన్నారు.

తడికలపూడిలోని జడ్పీ హైస్కూల్‌కు బెంచీల అందజేత

కామవరపుకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట మండలం తడికలపూడిలోని జడ్పీ హైస్కూలుకు పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బెంచీలను దాతలు ప్రధానోపాధ్యాయులు సర్వేశ్వరరావు ద్వారా అందజేశారు. ఎంఈవో ప్రశాంతకుమార్, స్కూలు కమిటీ చైర్మన్ వెలమాటి నాగేశ్వరరావు, స్కూలు డవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ బొంతు వెంకటేశ్వరరావు, వంగపండు శ్రీను, మేరుగు సుందరరావు, దోమతోటి నతానియేల్ పాల్గొన్నారు.

యాత్రకు ఇంకెంతకాలం!

నిధులు విడుదలైనా జాప్యమే
విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్రలకు అడ్డంకులు

ఏలూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : నిధులు విడుదల చేయడంలో జిల్లా అధికారుల జాప్యంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్రలకు మరింత ఆలస్యమవుతోంది. తొలుత తీసుకున్న నిర్ణయం ప్రకారం ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు చదువుతున్న 168 మంది బాలబాలికలను ఈ నెల 19న కె.ఆర్.పురంలో స్థానిక మహిళలు చిరుధాన్యాలతో తయారు చేస్తున్న బిస్కెట్ల ఫ్యాక్టరీని విజ్ఞాన, విహారయాత్ర నిమిత్తం జిల్లా విద్యాశాఖ అధికారులు తీసుకెళ్లాల్సి ఉంది. అలాగే హైస్కూళ్ళలో 7, 8, 9 తరగతులు చదువుతున్న 153మంది విద్యార్థులు, వారి గైడ్ టీచర్లతో కూడిన బృందం ఈ నెల 12న రాత్రి ఏలూరులో బయలుదేరి తిరుపతిలో రీజినల్ సైన్సు సెంటర్, జూ పార్కు, చంద్రగిరి కోట, తదితర ప్రాంతాలను సందర్శించి 13న రాత్రి తిరుగుప్రయాణం జరగాల్సి ఉంది. ఈ యాత్రల నిమిత్తం ప్రాథమిక తరగతుల విద్యార్థులు ఒకొక్కరికి రూ.200 చొప్పున, హైస్కూలు విద్యార్థులు ఒకొక్కరికి రూ.2 వేలు వంతున నిధులను గత నెల 5న ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను వినియోగించడానికి సమగ్రశిక్ష జిల్లా అధికారులు ఫైలును రూపొందించి కలెక్టర్ అనుమతితో డీఈవో బ్యాంకు ఖాతాకు జమ చేసినతర్వాతే యాత్రలకు కదలిక వస్తుంది. ఈ ప్రక్రియలో ఇంత వరకు డీఈవో బ్యాంకు ఖాతాకు నిధులు జమకాకపోవడంతో బుధవారం తలపెట్టిన హైస్కూలు విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్ర వాయిదా పడిందని సంబంధిత అధికారి ఒకరు వివరించారు. మరోవైపు తిరుపతి యాత్రను వివిధ కారణాల రీత్యా వాయిదావేసి, దానిస్థానే విశాఖపట్నం తీసుకెళ్లాలని తాజాగా నిర్ణయించారు. అక్కడ ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ కళాశాల ల్యాబ్, సబ్‌మెరైన్, తదితర సైన్సు సంబంధిత ప్రాంతాలకు విద్యార్థులను రాగల ఐదారు రోజుల్లో తీసుకెళ్లడానికి యోచిస్తున్నారు. పదోతరగతి పరీక్షల దృష్ట్యా ఏదైనా సెలవురోజున విశాఖ తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని తణుకు, నరసాపురం ఆర్టీసీ బస్ డిపోల నుంచి పుణ్యక్షేత్రాల సందర్శన నిమిత్తం అందుబాటులోకితెచ్చిన ప్యాకేజీలను విజ్ఞాన, విహారయాత్రల కోసం వినియోగించుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు అధికారవర్గాలు వివరించాయి. కాగా రాష్ట్రేతర ప్రాంతాలకు కూడా విజ్ఞాన, విహారయాత్రలకు విద్యార్థులను తీసుకెళ్లేందుకు నిధులు విడుదలైనప్పటికీ, పలు కారణాలతో కేవలం రాష్ట్ర పరిధిలోని ప్రాంతాల సందర్శనకే విద్యాశాఖ పరిమితంకాగా, ఆ మేరకు మిగులు నిధులు ప్రభుత్వ ఖాతాకు జమకానున్నాయి.ఇక ఎండల తీవ్రత పెరిగిపోతుండటం, మిగతా తరగతుల విద్యార్థులకూ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో కనీసం రాష్ట్రపరిధిలో తలపెట్టిన యాత్రలు కొనసాగుతాయో లేదో చూడాలి..



కంకర వేసి వదిలేసిన నిమ్మలగూడెం - మంగయ్యపాలెం రోడ్డు

దుమ్ముతో వేగలేకపోతున్నాం

బుట్టాయగూడెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లు దుమ్ముతో అధ్వానంగా తయారయ్యాయి. మట్టి రోడ్లపై ప్రయాణం నరక ప్రాయంగా ఉందని కళ్లలో దుమ్ము పడి ప్రమాదాలు జరుగుతున్నాయంటూ ప్రజలు వాపోతున్నారు. బీటీ, ఇతర రోడ్లను జేసీబీలతో తొలగించడంతో కష్టాలు రెట్టింపైనట్టు ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును నిర్మించండి



మారుమూల ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. నిమ్మలగూడెం నుంచి మంగయ్యపాలెం వరకు నూతనంగా తారు రోడ్డును నిర్మిస్తామంటూ ఉన్న రోడ్డును తొలగించారు.. దీంతో మారుమూల ప్రాంతాలకు వెళ్లాలంటే జనాలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు. ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తిచేయాలి.

మాల్చి వెంకన్నబాబు, సర్పంచ్, మంగయ్యపాలెం

కాలిన గాయాలతో వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పుల్లలపొయ్యిపై వంట చేస్తున్న వృద్ధురాలు తీవ్ర గాయాలకు గురైంది. ఆమెను జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా బుధవారం సాయంత్రం మృతి చెందింది. జంగారెడ్డిగూడెం గరుడపక్షినగర్‌కు చెందిన బోగిరెడ్డిసుబ్బాయమ్మ (88) బుధవారం ఉదయం కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు ఆమె వస్త్రానికి అంటుకోవడంతో తీవ్ర గాయాలకు గురైంది. ఆమెను జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యం అనంతరం బుధవారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో ప్రభుత్వ పథకాలు

పెదపాడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వ పథకాలు పొందేందుకు వీలు కలుగుతుందని పెదపాడు మండల వ్యవసాయా ధికారి వి.ప్రదీప్ కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం, గోగుంట గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏవో ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ రబీ 2025 సీజన్‌కి సంబం ధించి పంట నమోదు పూర్తయిందని, రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదులో నమోదు అయిన రైతుల జాబితాలను ఉంచడం జరుగుతుందన్నారు. s

తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం

ఏలూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వహయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపనులకు తొలి అడుగుపడింది. స్థానిక కస్తూర్బా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన రెండంతస్తుల అదనపు తరగతిగదుల నిర్మాణపనులకు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ బుధవారం శంకుస్థాపన చేసారు. ఆయన మాట్లాడుతూ మన బడి-మన భవిష్యత్తుకింద జిల్లాకు రూ.14.41కోట్లు మంజూరయ్యాయని, ఈ నిదులతో పాఠశాలల్లో ఏసీఆర్‌లు, ప్రహరీగోడలు నిర్మాణం, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పీఎం శ్రీ-2 పథకం నిదులతోఇక్కడి పాఠశాలలో చేపట్టిన భవననిర్మాణాన్ని రాగల ఆరునెలల వ్యవధిలో పూర్తిచేసి తరగతుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటున్నందున ఆయన అనుమతిమేరకు భవన నిర్మాణపనులకు తాను శంకుస్థాపన చేసినట్టు వివరించారు. నిర్మాణపనుల్లో నాణ్యమైన సామాగ్రిని వినియోగించాలని సూచించారు. స్కూలు హెచ్ఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చెయ్యండి

లింగపాలెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వర్క్‌ఫ్రంహోమ్ సర్వే కార్యక్రమం మండలంలో చురుగ్గా కొనసాగుతోంది. ప్రతి గ్రామంలో వార్డు, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఈ సర్వే చేపడుతున్నట్టు ఎంపీడీవో కె.వాణి తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 60శాతం సర్వే పూర్తయిందని తెలిపారు.

వైభవంగా జనార్దన స్వామి కల్యాణం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : అగ్రహారంలోని జనార్ధన స్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి జనార్ధనస్వామి, రంగనాయక స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వంగల పవన కుమారా చార్యులు, వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగబాబు, సిబ్బంది భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

నేటి నుంచి జనార్దన స్వామి కల్యాణోత్సవం

దెందులూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : సోమవరప్పాడు గ్రామంలోని శ్రీజనార్దన స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం 13 నుంచి 17వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ధర్మకర్త చైర్మన్ చలసాని శ్రీధర్ బాబు తెలిపారు. 13న కల్యాణం, 17వ తేదీ ఆఖరి రోజున అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

లక్ష్మీగణపతి స్వామికి హారం బహూకరణ

ఏలూరు కార్పొరేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సత్రంపాడులోని లక్ష్మీగణపతి స్వామి ఆలయానికి సత్రంపాడుకు చెందిన బలుసు సుబ్బయ్యచౌదరి-కనకదుర్గ దంపతులు రెండు లక్షల రూపాయలు విలువైన 21 గ్రాముల 620 మిల్లీ గ్రాముల బంగారు హారాన్ని ఆలయ అర్చకులు ఆర్.రాఘవేంద్ర కుమార్ శర్మకు ఈవో సి.హెచ్.చిననాగేశ్వరరావు సమక్షంలో అందచేశారు. అర్చకులు స్వామికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు దాతలను అభినందించి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

వైసీపీ యువత పోరు సిగ్గు చేటు

భీమడోలు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టే యువత పోరును వైసీపీ ముఠా, జగన్ మోహన్ రెడ్డి ఇంటి ముందు చేయాలని ఏలూరు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఎద్దేవా చేశారు.పదవిలో ఉండగా విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు గుర్తు రాలేదని అన్నారు. జగన్ హయాంలో కళాశాల యాజమాన్యాలను, విద్యార్థులను వేధించారని, హాల్‌టిక్కెట్లు నిలిపివేసి పరీక్షలు రాయనివ్వకుండా చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ఐదేళ్ల చేసిన అవినీతిని గుర్తు తెచ్చుకుని పశ్చాత్తాప పడాలని ప్రజలకు సరైన సమాధానం చెప్పాల్సిన అవసరం జగన్‌కి ఉందని గన్ని వీరాంజనేయులు అన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ సీఈవో

ఏలూరుసిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ సీఈఓ ఎఫ్ఏసీ బాధ్యతలను డిప్యూటీ సీఈఓ కె.భీమేశ్వర్ బుధవారం స్వీకరించారు. ప్రస్తుతం జడ్పీ సిఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు నెల రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో డిప్యూటీ సీఈవో ఈ బాధ్యతలను స్వీకరించారు. జడ్పీ సిఈఓ భీమేశ్వర్‌ను జడ్పీ ఏఓలు, ఇతర సిబ్బంది అభినందించారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు అన్నారు. జిల్లాలో ఉన్న 8 రోడ్డు సేఫ్టీ మొబైల్ వాహన సిబ్బందితో ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ చేయాలని ప్రమాదాల నివారణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకరమైన ప్రాంతాలు, జంక్షన్ల వద్ద సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు. ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కారించాలని ధర్నా


బుట్టాయగూడెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ బుధవారం కెఆర్ పురం ఐటిడిఏ కార్యాలయం ఎదుట సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వాసిత గిరిజనులు ధర్నా చేశారు. కటాఫ్ తేది లేకుండా 18 సంవత్సరాలు నిండిన యువతకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి ఎస్‌కె గౌస్ డిమాండ్ చేశారు. ఏలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 45.72 కాంటూర్లో ఉన్న గ్రామాలను 41.15లో తీసుకుని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలన్నారు.

మొరాయించిన బస్సు



నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ఆకివీడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కండిషన్ లేని పాత ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు తీవర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భీమవరం నుంచి ఏలూరు బయలుదేరింది. సుమారు 60 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆకివీడు కొత్త బస్టాండు వద్ద సాంకేతికలోపంతో బస్సు నిలిచిపోయింది. డ్రైవరు, కండక్టర్‌పై ప్రయాణికులు ఆగ్రహించారు. ప్రయాణికులను ఆర్డినరీ బస్సులలోనే ఎక్కించాల్సి ఉంది. ప్రత్యామ్నాయంగా మొత్తం ప్రయాణికులను ఒక బస్సులో సర్దుబాటు చేయడం సాధ్యం కాలేదు. దీనితో రెండు, మూడు బస్సులు వచ్చే వరకు ప్రయాణికులు వేచి ఉన్నారు. కొందరు మళ్లీ టిక్కెట్ తీసుకుని ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లో వెళ్లిపోయారు. ఆర్టీసీ పాత బస్సులు రోజూ ఎక్కడో ఒకచోట నిలిచిపోతున్నాయని ప్రయాణికులు వాపోయారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘ సభ్యులు

బ్లడ్ క్యాన్సర్ బాధితుడికి సాయం

ఏలూరు రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్ బాధితుడు బీ.శ్రావణ్‌కుమార్‌కు జిల్లా ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం రూ.45 వేలు ఆర్థిక సహాయం అందజేసింది. యువజన సంఘం కార్యాలయంలో జనసేన నాయకులు, ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు చెక్కును శ్రావణ్ కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం అధ్యక్షులు ఒబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ బ్లడ్ క్యాన్సర్ నుంచి కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్‌బాబు, ఎల్.సంతోష్, విశ్వనాథ్, పవన్, కే.పవన్, సి.హెచ్.సూర్యనారాయణ, సత్యనారాయణ, ప్రశాంత్, శ్రీకాంత్, రామ్‌ప్రసాద్, రవి, కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

గాయపడిన గిరిజన బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే (ఇన్‌సెట్‌లో బాధితుడు)

జంగారెడ్డిగూడెం,(ఏలూరు)మార్చి 12(ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ అధికారుల దాడిలో గాయపడిన గిరిజన బాధితుడు మడకం యాకోబును పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బాధితుడిని పరామర్శించారు. యాకోబు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బుట్టాయగూడెం మండలం గుళ్లపూడికి చెందిన తనను అటవీ శాఖ అధికారులు నిర్బంధించి కొట్టి గాయపర్చారంటూ గిరిజన బాధితుడు మడకం యాకోబు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యాకోబు మాట్లాడుతూ అడవి నుంచి ట్రాక్టరుపై బ్యారన్ పుల్లల నిమిత్తం గత శనివారం అటవీ శాఖ అధికారులకు రూ.50 వేలు చెల్లించినట్టు తెలిపారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ట్రాక్టరుపై పుల్ల తీసుకొస్తుండగా సోమవారం రాత్రి కొల్లాయగూడెం సమీపంలో అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. డబ్బులిచ్చినా ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించినందుకు కన్నాపురం రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్ళి గదిలో బంధించి చిత్రహింసలకు గురిచేశారని వాపోయాడు. తనను ఓ అధికారి బూటు కాళ్లతో పక్కటెముకలపై విచక్షణారహితంగా తన్నారని, మరికొందరు కర్రలతో దాడి చేశారని తెలిపాడు. తనను కొట్టినట్టు ఎవరికైనా బెబితే చంపేస్తానని బెదిరించారని యాకోబు తెలిపారు. కన్నాపురం కార్యాలయానికి తన బంధువులు బుట్టాయగూడెం ఆసుపత్రిలో చేర్పించారని తెలిపాడు. ఈ ఘటనపై ఇప్పటికే బాధితుని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బొరగం శ్రీనివాసులు పరామర్శ

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రభుత్వానికి చెట్టపేరు తేవద్దని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అధికారులకు సూచించా రు. అటవీశాఖ అధికారి గిరిజనుడిపై దాడి చేసిన ఘటనలో గాయపడి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మడకం యాకోబును బుధవారం ఆయన పరామర్శించి భరోసా కల్పించారు.

సబ్ డీఎఫ్‌వోపై చర్యలు తీసుకోవాలి

కొయ్యలగూడెం : గిరిజనుడిపై దాడి చేసిన సబ్ డిఎఫ్ఓ పై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజనులు బుధవారం కన్నాపురం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్ఓకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుట్టాయగూడెం మండలం గుళ్ళపూడికి చెందిన మడకం యాకోబు అక్రమ కలప తరలిస్తున్నాడని అతని పై కేసు నమోదు చేయడమే కాకుండా చిత్రహింసలకు గురిచేశారంటూ పెద్దఎత్తున ఆందోళన చేశారు.

ఆక్వాలో గిట్టుబాటు ధర కల్పించాలి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి ఆక్వా రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అన్నే భవన్‌లో ఆయన మాట్లాడుతూ రొయ్యల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.ఒకవైపు ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగాయని, తగిన దిగుబడులు రావడంలేదన్నారు. దీంతో రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి సబ్సిడీలు ఇవ్వాలని కోరారు.

ఆక్రమణలు తొలగించండి

చింతలపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీలో 21 చెరువులు, కుంటలు ఉన్నాయని, వాటి విస్తీర్ణం సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని సీపీఐ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. మూడు కుంటలు ఇప్పటికే మాయమయ్యాయని ఆక్రమణల్లో ఉన్నాయన్నారు. పెద్ద చెరువు, వేగిలింగేశ్వర స్వామి చెరువు, మొహిద్దీన్ కుంట చెరువులను ఆక్రమించి భవనాలు కట్టారని, మిగిలిన చెరువు, కుంటలను కూడా ఆక్రమించారని పేర్కొన్నారు. ఈ చెరువులను సర్వే జరిపి హద్దులు గుర్తించాలని సీపీఐ నాయకులు టి.బాబు, డి.కృష్ణ, ఎస్.కె.కాలేషా, టి.మాణిక్యాలరావులు కలిసి మునిసిపల్ కమిషనర్ పావనికి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

చర్చి నిర్మాణం అడ్డగింత

ద్వారకాతిరుమల, మార్చి12(ఆంధ్రజ్యోతి) : శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం సంతానవేణుగోపాల జగన్నాథ స్వామి ఆలయం సమీపంలోని ఓస్థలంలో చర్చి నిర్మాణం జరపడాన్ని బుధవారం బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. అక్రమంగా చర్చినిర్మాణం జరపడానికి కొందరు ప్రయత్నించినట్లు వివరించారు. దీన్ని అడ్డుకుని అక్కడ అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని స్థానిక హిందువులతో కలిసి బిజెపి నేతలు ప్రతిష్ఠించారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన భౌతిక, ఆర్థిక శాస్త్రం పరీక్షలకు జిల్లాలో మొత్తం 14,482మంది దరఖాస్తుచేసుకోగా 14,078 మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్ విభాగంలో 12,669 మందికి 12,394మంది, ఒకేషనల్ విభాగంలో 1813మందికి 1684మంది హాజరయ్యారని వివరించారు.

'ఓపెన్' ఇంటర్ పరీక్షల్లో : ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య ఇంటర్మీడియట్ గణితం పరీక్షకు 217మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 182మంది, చరిత్ర పరీక్షకు 204 మందికి 179మంది హాజరయ్యారని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

నేడు నామవరంలో కళాజాత

చింతలపూడి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం నామవరం గ్రామంలో నవోదయం 2.0లో భాగంగా సారా నిర్మూలనకై జానపద కళాకారులచే కళాజాత ప్రదర్శన గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నామని స్థానిక ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఇఎస్ఐ, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

వైసీపీ ఆవిర్భావ వేడుకలు

టి.నరసాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : విలువకు, విశ్వసనీయతకు వైసీపీ ప్రతీక అని జడ్పీటీసీ సామంతపూడిబాల సూర్యనారాయణ రాజు అన్నారు. టి.నరసాపురంలో వైసీపీ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన జెండాను ఆవిష్కరించి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీను రాజు, వైసీపీ ఏలూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, ఎంపీపీ దారబోయిన లక్ష్మి, సర్పంచ్ మోదుగు సునంద, ఎంపీటీసీలు నార్లపాటి వెంకటేశ్వరరావు, అర్జా బాలయ్య, దేవరపల్లి ముత్తయ్య, ఉమ్మడి తేజ, వంటిపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు తగదు

కుక్కునూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న తనపై అవినీతి ఆరోపణలు చేయడం తగదని విద్యుత్ ఏఈ మోహన్‌పాపారావు ఖండించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీపీఎం నాయకులు వై.నాగేంద్రరావు తనపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. నర్సరీల్లో అక్రమంగా విద్యుత్ వాడితే చర్యలు తీసుకుంటామన్నారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

భార్యపై దాడి.. భర్తపై కేసు

ఏలూరు క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భార్యపై దాడిచేసి గాయపర్చిన భర్తపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులోని సుబ్రహమణ్య కాలనీకి చెందిన కాటూరి హరిత (35)ను ఆమె భర్త అమ్మినరాజు ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. గాయాలపాలైన ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఆమెను శారీరకంగా, మానసికంగా కూడా హింసకు గురి చేస్తున్నాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ వి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హరిత భర్త అమ్మినరాజుపై కేసు నమోదు చేశారు.

గూటాలలో లక్ష్మీ నరసింహస్వామి
ఆలయ పునఃప్రతిష్ఠ

పోలవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం గూటాల గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ కోసం వేసిన సర్వే బాదులకు గేదెలు తగులుకుని వెళ్లడంతో సర్వేబాదులు 11 కెవి వైర్లకు తగులుకుని షార్ట్ సర్క్యూట్ జరిగి హైస్కూలు ప్రాంతం నుంచి ఎస్సీ కాలనీ వరకూ ఉన్న 250 విద్యుత్ దీపాలు కాలిపోయాయి. సుమారు రెండు లక్షల తొంభైవేల రూపాయల నష్టం జరిగినట్లు ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు పంచాయతీ కార్యదర్శి తాతి విజయ కుమారి తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


శివకుమార్

కలిదిండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొండంగికి చెందిన పిల్లారిశెట్టి శివకుమార్ (30) ఈ నెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం అన్నయ్య పిల్లారిశెట్టి సుధీర్ కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట : మంత్రి పార్థసారథి


మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం బంగారు బాట వేస్తున్నదని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కలటూరు ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యా కమిటీ చైర్మన్లు ఉపాధ్యాయులతో జీవో 117పై సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో నుంచి మోడల్ స్కూల్స్‌కి పంపడం ద్వారా జరిగే మేలు అందరూ అర్థం చేసుకోవాలన్నారు. మోడల్ స్కూల్స్‌కి వెళ్లే విద్యార్థులకు రవాణా ఖర్చులు నెలకు రూ.600 చెల్లిస్తామన్నారు. ఒక విద్యార్థి ఉన్న స్కూల్స్ రాష్ట్రంలో 12,600 ఉన్నాయని అలాంటి వారంతా మోడల్ స్కూల్స్‌లో చేరి మెరుగైన విద్యను అభ్యసించాలని కోరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

ముదినేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గురజలో బుధవారం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం హోమ కార్యక్రమాలు, వైఖానస సంప్రదాయం ప్రకారం శ్రీ చక్రత్తాళ్వార్ ఊరేగింపు అనంతరం జగజ్యోతి కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు తేజోరామ్ పరాశరం శ్రీరంగ నాథాచార్యులు నిర్వహించిన ఈ కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అంతకు ముందు ఏనుగు వాహనంపై స్వామివార్ల ఊరేగింపును నిర్వహించారు. మిల్క్ సొసైటీ అధ్యక్షురాలు ఉప్పలపాటి శ్రీలక్ష్మి, టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.25 వేలు సాయం


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వినోద్, నరసింహారావు

ముదినేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వడాలిలో ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించిన తెలుగుదేశం పార్టీ అభిమాని కటికల నాగ బాబు కుటుంబాన్ని బుధవారం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ పరామర్శించి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ తరపున అండగా ఉంటామని మృతుడి కుటుంబానికి వినోద్‌తో పాటు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు భరోసా ఇచ్చి మృతుడి తల్లిని ఓదార్చారు.

బేసిక్ ప్రైమరీ స్కూళ్ల కొనసాగింపే మంచిది

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చ

ముదినేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థలో రానున్న ఐదు రకాల బడుల ప్రతిపాదనలు, 17వ నంబరు జీవో రద్దు తదితర విద్యా విషయక అంశాలపై మండలంలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశాల్లో ఉపాధ్యాయులు చర్చించారు. గ్రామాల్లో తల్లిదండ్రుల అభిప్రాయాలు, ఎస్ ఎంసీల తీర్మానాలను వెల్లడించారు. ప్రాథమిక స్థాయిలో నేడు ఒకటి నుంచి ఐదు తరగతులను కొనసాగిస్తూ బేసిక్ ప్రైమరీ పాఠశాలలను ఉంచాలన్న అంశం వైపే ఉపాధ్యాయులు మొగ్గు చూపారు. బొమ్మినంపాడు, అల్లూరు, పెదగొన్నూరు, పెదపాలపర్రు, ముదినేపల్లి హైస్కూళ్లల్లో ఆయా కాంప్లెక్స్ స్కూళ్ల హెచ్ఎంల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో మోడల్ స్కూళ్ల ఏర్పాటు, బేసిక్ ప్రైమరీ స్కూళ్ల కొనసాగింపుపై చర్చ జరిగింది.

జనసేన విజయోత్సవ సభను జయప్రదం చేయాలి

నూజివీడు/కలిదిండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జన సేన ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహిస్తున్న విజయోత్సవ సభను జయప్రదం చేయాలని జనసేన నాయకులు బొబ్బిలి శ్రీకాంత్ కోరారు. నూజివీ డు నియోజకవర్గం నుంచి దాదాపు రెండు వేలమంది కార్యకర్తలను సమీకరించి పిఠాపురం సభకు తరలివెళుతున్నట్టు తెలిపా రు. ఈనెల 14న ఉదయం ఎనిమిది గంటలకు రాజీవ్‌సర్కిల్ నుంచి బస్సులు, కార్లతో ర్యాలీగా బయల్దేరి పిఠాపురం వెళుతున్నట్లు తెలిపారు.

కోరుకొల్లులో..

పిఠాపురంలో ఈనెల 14న నిర్వహించే జన సేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ పిలుపునిచ్చారు. కోరుకొల్లులో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. జనసేన సభను విజయవంతం చేయాలని కోరారు.

చిన్నపిల్లలకు టీకాలు

ఆగిరిపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సగ్గూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గల ఈదులగూడెం, కృష్ణవరం గ్రామాల్లో చిన్న పిల్లలకు రొటీన్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమం సగ్గూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మంజుల దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు టీకాలు చేయడం ద్వారా వారికి నిమ్ము, క్షయ, పోలియో, తట్టు, వంటి వ్యాధులు బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. అందరూ తప్పనిసరిగా టీకా కార్యక్రమాన్ని వినియోగించాలని గ్రామ ప్రజలకు తెలిపారు. సూపర్‌వైజర్ మరియమ్మ, ఏఎన్ఎం కోటేశ్వరమ్మ, ఆశావర్కర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం


పరీక్షల సామగ్రిని అందిస్తున్న కోలేటి పాల్ రమేష్

ఆగిరిపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):స్వయం ఉపాధి పథకాలకు ఈనెల 10 నుంచి 23వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆగిరిపల్లి మండల ఇన్‌చార్జి ఎంపీడీవో ఆనంద్‌బాబు తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బీసీ, ఈ-బీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్లకు సంబంధించిన లబ్ధిదారులకు పలు పథకాల ద్వారా సబ్సిడీ మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. లబ్ధిదారుల ఆదాయం 81,000 లేదా అంతకన్నా తక్కువగా ఉండాలని, తెల్ల రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రము, ఆధార్‌కార్డు ఉండాలని, ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే లబ్ధి పొందేందుకు అవకాశమని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేత

టెన్త్ విద్యార్థులు సరైన సమయపాలనతో మంచి మార్కులు సాధించవచ్చని గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయుచున్న 170మంది విద్యార్థులకు గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ ద్వారా పరీక్షల సామగ్రిని అందించారు. కోలేటి పాల్ రమేష్‌ను పాఠశాల హెచ్ఎం పి.పుష్పలత అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం బి.వి.ఎస్.లక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ జె.వెంకటేశ్వరరావు, ఎస్.అల్లాభక్షు, ఎన్.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నలుగురి నిందితుల అరెస్ట్

చాట్రాయి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లోని ఎక్సైజ్ కేసులలో నిందితులుగా ఉన్న కొమ్ము విజయలక్ష్మి(చీపురుగూడెం), కటారి కుమారి(సి-గుడిపాడు),వడిత్య సక్రు, బాణావత్తు బాలు(పోతనపల్లి, చిన్న తండా) లను బుధవారం అరెస్ట్ చేసి తిరువూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ సారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారు చేసినా, అమ్మినా, నల్ల బెల్లం సరఫరా చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రహదారుల వెంట చెత్తకుప్పల తొలగింపు


చాట్రాయిలో చెత్త కుప్పలు తొలగిస్తున్న అధికారులు

చాట్రాయి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో రహదారుల వెంట ఉన్న చెత్త కుప్పలను బుధవారం అధికారులు ఎక్స్‌కవేటర్‌తో ఎత్తించి ట్రాక్టర్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చెత్త కుప్పల తొలగింపు పనులు జరిగాయి.

నేడు పాతాళ భోగేశ్వరస్వామి 16 రోజుల పండుగ

కలిదిండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయం వద్ద 16 రోజుల పండుగ నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. స్వామివారికి విశేష పూజలు అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు పెద్దింటమ్మ తెప్పోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కైకలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారంతో ముగియనుండడంతో చివరి రోజు భక్తులు వేలాదిగా తరలి వస్తారనే అంచనాలతో ఈవో కూచిపూడి శ్రీనివాసు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు. సాయంత్రం అమ్మవారి కోనేరులో తెప్పోత్సవం కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి అష్టాదశ పీఠపూజ, అష్టాదశ కలశార్చన, వ్రతసాధన హోమం, బలిహరణ, దూపసేవ, బాలభోగం, హారతి, పంచ హారతులు, మంత్రపుష్పం వంటి పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, భక్తులకు ఉచిత ప్రసాదాన్ని కైకలూరుకు చెందిన పోతునూరి మణికుమార్, శ్వేత దంపతులు, తణుకు చెందిన ఉంగరాల కిషోర్, పద్మజ దంపతులు, లక్ష్మీపురానికి చెందిన కాటూరి జగదీష్, నాగప్రమీలారాణి దంపతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాత్రి కైకలూరుకు చెందిన యు.నాగసత్యవతి ఆధ్వర్యంలో శ్రీమన్నారాయణగోష్టి, మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

వైభవంగా గరుడోత్సవం


లక్ష్మీనృశింహ స్వామికి గరుడోత్సవ దృశ్యం

కైకలూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వరహాపట్నం భూసమేత శ్రీలక్ష్మీనృశింహ స్వామి 123వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం స్వామికి విశేషపూజలను నిర్వహించారు. గ్రామ వీధుల్లో గరుడోత్సవాన్ని భక్తుల కోలాహలం మధ్య నిర్వహించారు. సాయంత్రం కల్పవృక్ష, వాహన సేవ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈవో శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

రూ.రెండు కోట్లతో నీటిపారుదల వ్యవస్థ అభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని


పెదకామనపూడి వద్ద పెదకొమ్మిలేరు డ్రెయిన్ పనులను ప్రారంభించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు ముంపు సమస్యను ఎదుర్కొకుండా కైకలూరు నియోజకవర్గంలో రూ.రెండు కోట్ల వ్యయంతో నీటి పారుదల వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. పెదకామనపూడి వద్ద పెదకొమ్మిలేరు మేజర్ డ్రెయిన్‌లో కిక్కిస, తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. కామినేని మాట్లాడుతూ రూ.150 కోట్లతో డ్రెయిన్ల అభివృద్ధి పనులు, రూ.50 లక్షలతో పంట కాల్వల అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. డ్రెయిన్లను పూర్తిస్థాయిలో తవ్వించేందుకు పనుల ప్రణాళికలను రూపొందిస్తున్నా మని, ఖరీఫ్ సీజన్ నాటికి తూడు, డెక్క తొలగింపు పనులను పూర్తి చేస్తామని తెలిపారు. నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు కూడ పర్యవేక్షించి పనులు నాణ్యతగా జరిగేటట్లు చూడాలన్నారు. మైనర్ డ్రెయిన్లను తవ్వించేందుకు నిధులు మంజూరు చేయించాలని పలువురు రైతులు ఎమ్మెల్యేని కోరారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, పెదగొన్నూరు, ముదినేపల్లి డీసీ చైర్మన్లు గుడిసేవ సురేష్, నీటి సంఘాల అధ్యక్షుడు పోసిన పాండురంగారావు, తహసీల్దార్ సుభాని, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, పెదగొన్నూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు కట్టా కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

భూములపై హక్కు కల్పించాలి

ముదినేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లిలో గత 67 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ బంజరు భూములపై ఎస్టీ వర్గానికి చెందిన పేద కుటుంబాలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు టి.ప్రకాష్, పి.రమేష్, ఎస్.హరిబాబు, టి.సత్యనారాయణ, కె.ప్రసాద్ నాయకత్వంలో భూముల అనుభవదారులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఎస్టీ కుటుంబాలైన తాము ఆరు దశాబ్దాలుగా శిస్తులు చెల్లిస్తూ భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చుకుని సాగు చేసుకుంటున్నామని, ఆ భూములపై హక్కులు కల్పించాలని కోరారు. డీటీ పవన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో సీతారాములు

కన్నుల పండువగా సీతారామ విగ్రహాల ప్రతిష్ఠ

ఆగిరిపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కనసానపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి వార్ల ఆలయంలో బుధవారం స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ, విమాన శిఖర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, సీతారామ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమాలు వేదాంతం రాజగోపాల చక్రవర్తి వార్ల యాజ్ఞిక నిర్వహణలో అర్చకులు వేదాంతం రవికుమార్, ఉభయ దాతలు, కమిటీ సభ్యులు, పెద్దలు, ప్రముఖులు, భక్తులచే వైభవంగా నిర్వహించారు.

ఇంటింటా చెత్త సేకరణ

ఆగిరిపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి సంపద తయారీలో భాగంగా బుధవారం మండలంలోని వడ్లమాను, కనసానపల్లి, నెక్కలంగొల్లగూడెం పంచాయతీలలో ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్య సమాజం నిర్మించేందుకు ప్రజలందరూ సహకరించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

చాట్రాయి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో బుధవారం ఇంటర్ సెకండ్ ఇయర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరిగాయి. 88 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం

రూ. 2.05 లక్షలు పోగొట్టుకున్న యువతి.. పోలీసులకు ఫిర్యాదు

ముదినేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆశ చూపిన భార్యాభర్తలను నమ్మి సొమ్ము పోగొట్టుకున్న ఓ విద్యా వంతురాలి ఉదంతమిది. రూ.2.05 లక్షలకు ఆ యువతికి ఎగనామం పెట్టి చివరికి ఉద్యోగం లేదంటూ చేతులెత్తేసిన ఈ ఘటనకు సంబంధించి ముదినేపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముదినేపల్లికి చెందిన రత్న అనే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌కు కైకలూరుకు చెందిన పి.వెంకట్, సంజన దంపతులు ఏడాదిన్నర క్రితం పరిచయం అయ్యారు. వారిద్దరూ మరో వ్యక్తిని పరిచయం చేసి ఆయనే ఉద్యోగం ఇప్పిస్తాడని నమ్మబలికారు. డబ్బులు కడితే హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వస్తుందని ఆశ చూపడంతో అప్పటికే ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న రత్న వారి ని నమ్మి 2023 నుంచి ఇప్పటి వరకు విడతల వారీగా రూ.2.05 లక్షల సొమ్ము వారు చెప్పిన ఆన్‌లైన్ అకౌంట్‌లో జమ చేసింది. అనంతరం ఉద్యోగం పరిస్థితి ఏమిటని ఎన్నిసార్లు అడిగినా వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారే తప్ప ఉద్యోగం ఇప్పించలేదు. ఎంతకాలం గడిచినా ఉద్యోగం రాకపోవడంతో రత్న తాను మోసపోయానని గుర్తించి బుధవారం ముదినేపల్లి పోలీసులను ఆశ్రయించింది. తాను సొమ్ములు చెల్లించినా అకౌంట్ నెంబర్‌తో సహా సాక్ష్యాలను అందజేసింది. దీనిపై చీటింగ్ కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో చురుగ్గా 'వర్క్‌ఫ్రం హోమ్ సర్వే'


చాట్రాయిలో సర్వే చేస్తున్న అధికారులు

చాట్రాయి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పేద మధ్య తరగతి కుటుంబాల ఆదాయాన్ని పెంచి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వర్క్ ఫ్రం హోమ్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఐటీ, ఐటీ అనుబంధ రంగాలలో యువత, గృహిణులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడం ఈ పథకం లక్ష్యం. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వర్క్ ఫ్రం హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) చాట్రాయి మండలంలో చురుగ్గా జరుగుతుంది. మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో 18,750 కుటుంబాలు ఉండగా కనీసం 18 వేల మందికి వర్క్ ఫ్రం హోమ్ కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా ఉంది. ఇప్పటికి 40 శాతం సర్వే పూర్తి కాగా 16 తేదీకి సర్వే పూర్తి కావాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు వచ్చాయి. ఎంపీడీవో విజయలక్ష్మి, మండల పరిషత్ ఏవో విష్ణు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు మ్యాపింగ్ చేసిన ప్రతి కుటుంబాన్ని కలిసి వర్క్ ఫ్రం హోమ్ సర్వే చేసి వివరాలను అప్పటికప్పుడు ప్రభుత్వం ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌లో రిజిస్టర్ చేస్తున్నారు. ఆధార్ ఆధారిత ఫోన్ నంబర్లకు వచ్చిన ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రాంభిస్తున్నారు. విద్యావంతులు, నిరక్షరాసులు అనే రెండు కేటగిరీలుగా ఈ సర్వే జరుగుతున్నది.


ట్రిపుల్ ఐటీలో ప్రాజెక్టులు చూపుతున్న విద్యార్థులు

ముగిసిన మెగా ఎక్స్‌పో-25

నూజివీడు టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో మెగా ఎక్స్‌పో-25ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొగమంచుతో నిండిన వాతావరణంలో రోబోట్‌ల నేవిగేషన్, వన్యప్రాణులకు అనుకూలంగా ఉండే జంతు నివారణ వ్యవస్థ వంటి అంశాలపై పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ఎక్స్‌పోలో పలు అంశాలపై పోటీలు నిర్వహించగా నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి పది బృందాలు ఉత్తమ ప్రదర్శన కోసం అవార్డ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను పొందాయి. ఎన్ఆర్ఐ, శారద, లక్కిరెడ్డిబలిరెడ్డి వంటి 13 కళాశాలల నుంచి ఈ ఎక్స్‌పోలో పాల్గొనేందుకు విద్యార్థులు వచ్చి తమ ప్రాజెక్టులను పరిశీలించారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ తదితర ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు 30కి పైగా ఈవెంట్‌లను నిర్వహించారు.

15న ఐటీఐ కాలేజీలో జాబ్‌మేళా

నూజివీడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం జంగంగూడెం ఐటీఐ కళాశాలలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. జంగంగూడెం పొట్లూరి వెంకట చలపతిరావు, కృపావతమ్మ ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో వరుణ్ మోటార్స్, వీల్స్ ఇండియా తదితర కంపె నీల ప్రతినిధులు పాల్గొంటారని, నిరుద్యోగ యువతీ యువకులు తమ దరఖాస్తులతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు.

చిగురుకోట విద్యార్థులకు పరీక్ష

పదహారు కిలోమీటర్ల దూరంలో టెన్త్ పరీక్ష కేంద్రం

ముదినేపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు చిగురుకోట జడ్పీ హైస్కూలు విద్యార్థులు గతేడాది ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ ఏడాదీ తప్పడం లేదు. ఇక్కడి విద్యార్థులకు పరీక్షా కేంద్రం మార్చకపోవడమే ఇందుకు కారణం. గతేడాది టెన్త్ పరీక్షలు రాసేందుకు సుమారు 16 కిలోమీటర్ల దూరంలోని పెదగొన్నూరు హైస్కూలు పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. దీంతో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అంత దూరం వెళ్లటంలో తీవ్ర వ్యయ ప్రయాసలను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో పెదగొన్నూరు హైస్కూలు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి చాలా దూరంలో ఉన్న చిగురుకోట హైస్కూలు విద్యార్థులకు ఈ పరీక్షా కేంద్రానికి కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి దగ్గరల్లోని పరీక్షా కేంద్రానికి మార్చాలని ఆదేశించినా, అధికారులు పట్టించుకోకుండా ఈ ఏడాదీ అదే పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. దీంతో ఈ హైస్కూలు నుంచి 25 మంది విద్యార్థులు వ్యయ ప్రయాసలు పడుతూ టెన్త్ పరీక్షలు రాసేందుకు వెళ్లాల్సి వస్తోంది.

మామిడి పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన

ముసునూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో మామిడిపంట కోత సమయంలో నష్ట నివారణ, యాజమాన్య పద్ధతులపై బుధవారం ఉద్యానవనశాఖ, గ్రామోదయ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఎంఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ రాధారాణి, ఏఎస్‌సీఐ సీఈవో డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ మామిడికాయలు ఉదయం, తెల్లవారుజామున కోయడం వల్ల బాష్పోత్సేకం తగ్గి నిల్వ కాలం పెరుగుతుందన్నారు. కోత సమయంలో చెట్లకు నీటి తడులను తగ్గించడం వల్ల కాయల నాణ్యత మెరుగువుతుందన్నారు. దులపకుండ దపోలి హర్వెస్టర్లను ఉపయోగించడం వల్ల మామిడి కాయల నష్టం తగ్గి, 20శాతం అదనంగా ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఎంపీపీ కొండా విజయలక్ష్మి, మండల ఉద్యానవన అధికారిణి కె.జ్యోతిప్రియాంక, ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక విద్యలో నైపుణ్యత సాధించాలి

ముసునూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వైజ్ఞానిక, సాంకేతిక విద్యలో నైపుణ్యత సాధించాలని ఎంఈవో బి.వి.యస్ సుబ్బారావు అన్నారు. బుధవారం ముసునూరులో వున్న భారతి విద్యానికేతన్ హైస్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రిన్సిపాల్ కె.సోరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ నమూనాలను ఎంఈవో తిలకించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా సూచించారు. స్కూల్ కరెస్పాండెంట్ కె.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

110 మందికి ఉచిత కంటి పరీక్షలు

నూజివీడు టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మీర్జాపురంలో తిరువీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గోళ్ల పద్మ నేత్ర వైద్య శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వైద్య శిబిరంలో దాదాపు 110 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరువీధి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.